తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

30 ఏళ్ళ ప్రస్థానం వార్త వార్షికోత్సవం 1996 - 2026

వార్త

### గణనాధునికి ఘనంగా...

# విమానోత్సవం



కాణిపాకం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా శనివారం సిద్ధిబుద్ధి సమేతుడైన గణనాధుడు విమానవాహనంపై కాణిపాకం గ్రామ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈకార్యక్రమానికి ఐరాలకు చెందిన కీ॥శే॥ కె.రామకృష్ణ పిళ్ళై కుటుంబీకులు, దేవస్థానం వారు ఉభయదారులుగా వ్యవహరించారు. వీరు పగలు మంగళ వాయిద్యాల నడుమ వరుస ఉభయం తీసుకురాగా అర్చకస్వాములు స్వామివారి మూలవిరాట్‌కు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేక అభిషేకాలను, పూజలను నిర్వహించి అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే రాత్రి ప్రధాన ఆలయంలోని అలంకార మండపంలో సిద్ధిబుద్ధి సమేతుడైన గణనాధుని ఉత్సవమూర్తులను వుంచి మరోమారు వేదపండితుల మం త్రోచ్చారణ నడుమ అర్చక స్వాములు ప్రత్యేక పూజలు చేసి దూదీపనైవేద్యాలను సమర్పించారు. అనంతరం అలంకరించిన విమానవాహనంపై వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఈసందర్భంగా భక్తులు నారికేళ కరూ ్వర హారతులు సమర్పించి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ వి.మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్, ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, ఏఈఓలు రవీంద్రబాబు, ధనపాల్,ఆలయ సూపరెండెంట్‌లు వాసు,కోదండపాణి,టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, రవిలతో పాటు ఉత్సవ ఉభయదారులు పాల్గొన్నారు.

### స్థానిక సంస్థల ఎన్నికల్లో...

# వందశాతం విజయం సాధించాలి

**ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళాలి**

**అభ్యర్థుల విజయం కోసం చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు**

**-సమన్వయ కమిటీ సమావేశంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి**



పార్టీ కార్యాలయంలో మంత్రి మండిపల్లి ఆధ్వర్యంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం

చిత్తూరు, సెప్టెంబర్ 26 ప్రభా తవార్త: రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తూ సాగుతున్న కూటమి ప్రభుత్వం జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వంత శాతం స్ట్రైక్ రేట్ సాధించేలా పక్కా ప్రణాళిక రచించి అమలు చేయాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంతి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షులు చెక్కుడుకుప్పం షణ్ముగంరెడ్డి అధ్యక్షతన శనివారం త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలు గెలుపుకోసం అనుసరించాల్సి న వ్యూహంపై సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంకు తెలుగుదేశం పార్టీ తరపున రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల పార్టీ పరిశీలకులు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, జనసేన ఎమ్మెల్యే ధర్మరాజు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో రెండున్నర సంవత్సరాలుగా అధికారంలో వున్న కూటమి ప్రభుత్వం ప్రజలకు పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసి వారి ఆర్థికాభివృద్ధికి సహకారం అందిస్తోం దన్నారు. కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళి స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీ అభ్యర్థులను గెలిపించేలా పక్కా వ్యూహం రచించి అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో రెండున్నర సంవత్సరాలుగా కూటమి ప్రభుత్వం అధికారంలో వుంటున్నప్పటికీ వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించారని, ప్రజా సమస్యలను చర్చించడానికి అసెంబ్లీకి సైతం వైకాపా ఎమ్మెల్యేలు రావడం లేదన్నారు. ప్రస్తుతం జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనైనా వైకాపా పోటీ చేసి ఎన్నికలను ఎదుర్కోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక సంస్థలు ఒక ఎత్తు అని, ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న చిత్తూరు జిల్లాలో జరిగే స్థానిక సంస్థలు ఒక ఎత్తు అని, ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి సిఎంకు బహుమతిగా ఇవ్వాలని మంత్రి నాయకులకు పిలుపునిచ్చారు. కూటమి పార్టీలు ఎన్నికల్లో పోటీ చేసే స్థానాలను పార్టీ అధిష్టానాలు రాష్ట్ర స్థాయిలో నిర్ణయిస్తాయని, జిల్లా స్థాయిలో కూటమి నాయకులు కలసికట్టుగా వుంచి స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలు ఖరారు చేసిన అభ్యర్థుల విజయం కోసం చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. కూటమి పార్టీ అభ్యర్థులు ప్రతి చోట పోటీ చేసి విజయం సాధించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలపై కూటమి పార్టీల నేతలతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి అర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం, జిల్లా బిజెపి అధ్యక్షులు జగదీశ్వర్‌నాయుడు, పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, శ్రీనివాస్, ప్రభాకర్‌నాయుడు, కూటమి పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### వైకుంఠంలో ఆధ్యాత్మిక అనుభూతి కోసం....

# త్రీడి స్క్రీన్ల ఏర్పాటుకు ప్రణాళికలు

**-పిలిగ్రిమ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో శ్రీనివాసుడు ఆవిర్భావ రహస్యం**

**-స్వామివారి వైభవం, తిరుమల చరిత్ర, పురాణాలు, ఆలయ విశిష్టత,**



అదనపు ఈఓ వెంకయ్య చౌదరి

తిరుమల,సెప్టెంబర్ 26 ప్రభాతవార్త ప్రతినిధి: వైకుంఠం నుండి కలియుగంలో శ్రీవేంకటేశ్వరస్వామి అడుగుపెట్టిన అద్భుత దృశ్యాన్ని భక్తులకు కళ్ళకు కట్టినట్లు చూపించే పిలిగ్రిమ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ వైకుంఠమ్ 1 క్యూకాంప్లెక్స్ 17వ కంపార్టుమెంట్‌లో ఏర్పాటైంది. తిరుమలకు వస్తున్న సామాన్య భక్తుల నుండి ప్రముఖుల వరకు ఆ దేవుని దర్శనం కోసం ఉవ్విళ్ళూరుతుంటారు. భక్తులకు ఆలయంలోనికి చేరుకునే నిరీక్షణ సమయాన్ని మరింత ఆధ్యాత్మికంగా భక్తిపూర్వకంగా మార్చేందుకు టిటిడి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించింది. భక్తుల్లో ఆధ్యాత్మిక భావం పెంపొందించేలా వైకుంఠమ్ 1, 2 క్యూకాంప్లెక్స్ కంపార్టుమెంట్లలో త్వరలోనే త్రీడి స్క్రీన్లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. భక్తులకు కూడా త్రీడి కళ్ళఅద్దాలను అందజేసి ప్రత్యేక అనుభూతి వీక్షించేలా చూడనున్నారు. క్యూలైన్లో వెళ్ళే భక్తులకు మూడువైపులా స్క్రీన్లు ఏర్పాటుచేసి పూర్వం తిరుమలక్షేత్రం నుండి ఇప్పటివరకు పరిణామక్రమం చూపించనున్నారు. హీలింగ్ డెవోషనల్ సెంటర్ (భక్తుల అనుభవ కేంద్రం)ను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రం పనితీరు, ఇందులో శ్రీనివాసుడు తిరుమలపై అడుగుపెట్టిన అద్భుత దృశ్యాలు వీక్షించే విడి ఏర్పాటుచేసినట్లు టిటిడి అదనపు ఇఒ సి.హెచ్. వెంకయ్య చౌదరి తెలిపారు.

ఈ హీలింగ్ డెవోషనల్ సెంటర్ పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సెప్టెంబర్ 16న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా తిరుమలలో పలు అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయని, వాటిలో భాగంగా వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 17వ కంపార్ట్‌మెంట్‌లో పిలిగ్రిమ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను కూడా ప్రారంభించినట్లు అదనపు ఈఓ వెంకయ్య చౌదరి తెలిపారు.స్వామివారి వైభవం, తిరుమల చరిత్ర, పురాణాలు, ఆలయ విశిష్టత, ఆధ్యాత్మిక అంశాలు తదితరాలను 3డి, వర్చువల్ రియాలిటీ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అందించేందుకు ఈ కేంద్రాన్ని వినియోగించనున్నట్లు తెలిపారు. భక్తులు దర్శనం కోసం వేచి ఉండే సమయం ఒక నిరీక్షణగా కాకుండా, ఆధ్యాత్మికతను పెంపొందించుకునే, జ్ఞానాన్ని పొందే సమయంగా మార్చాలన్నదే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని వివరించారు.

పురాణాలు, కలియుగ ప్రత్యక్ష దైవమైన వేంకటేశ్వరస్వామి వైభవం, స్వామివారి సేవలు, భక్తుల కథలు, ఆలయ నిర్మాణం, చరిత్ర, పరిపాలన, దాతల సేవలు తదితర అంశాలపై విభిన్న కథనాలను రూపొందించి క్రమం తప్పకుండా ప్రసారం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. భక్తులు దర్శనానికి వెళ్లే ముందు స్వామివారి గురించి, తిరుమల ఆలయం గురించి, ఇక్కడి సంప్రదాయాలు, సేవలు, చరిత్ర గురించి మరింత తెలుసుకుని ఆధ్యాత్మిక పరిపూర్ణత, సంతృప్తితో దర్శనం చేసుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు.

# కళా వేదికపై గిరిజన గళం

**-తిరుపతిలో ముగిసిన జాతీయ మహోత్సవాలు -సమస్యల పరిష్కారానికి టీఎస్ఎఫ్ కార్యాచరణ**



తిరుపతి విద్య, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: గిరిజనుల ఆటపాటలు, సంప్రదాయ నృత్యాలతో పాటు వారి సమస్యలపై చర్చలకు తిరుపతి వేదికగా నిలిచింది. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో టీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహించిన జాతీయ ఆదివాసీ గిరిజన సాంస్కృతిక మహోత్సవాలు శనివారం ముగిశాయి. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు సంప్రదాయ కళారూపాలను ప్రదర్శించగా, జాతీయ కార్యవర్గ సమావేశంలో గిరిజనుల సమస్యలపై చర్చించారు.గిరిజనుల కళా, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షి ంచి భావితరాలకు అందించాలని వక్తలు సూచించారు. సంప్రదాయ కళలు కనుమరుగు కాకుండా కళాకారులను ప్రోత్సహించాల్సి న అవసరం ఉందన్నారు. కార్యవర్గ సమావేశంలో ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న గిరిజన బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, 500 మంది జనాభా ఉన్న గూడేలు, తండాలను ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, రహదారులు, రవాణా సదుపాయాలను మెరుగుపరచాలని కోరారు. టీటీడీ పాలక మండలితో పాటు వివిధ నామినేటెడ్ పదవుల్లో ఎస్టీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని తీర్మానించారు.టీఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు కరంశి అక్కులప్ప నాయక్ మాట్లాడుతూ గిరిజనుల హక్కులు, విద్య, ఉద్యోగాలు, సామాజిక న్యాయం కోసం సంఘటితంగా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూడవత్ విష్ణు నాయక్, తెలంగాణ అధ్యక్షుడు అజ్మీర్ నరేష్, పలువురు నాయకులు, గిరిజన కళాకారులు పాల్గొన్నారు.

### శివయ్యా...

# మూడవ కాలం అభిషేకం భక్తుల కోసం...కాదా!

**-అధికారులు, పాలకుల బంధువుల కోసమా?**
**-శివయ్య ఆదాయానికి గండి పెడుతున్న ఆలయాధికాలు**
**-నోరు పెదపని ఆలయ ట్రస్టుబోర్డు**



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామి అమ్మవార్ల దర్శనాలు పలుకుబడికే అత్యధిక ప్రాధాన్యత సంతరించుకుంటుంది. దేవుని ముందు అందరూ సమానులే అంటారు. అయితే ముల్లోకాల్ని ఏలే ముక్కంటీశుని అభిషేకాల దర్శనాలు ఆగమ్యగోచరంగా మారింది. ఇక్కడ నిబంధనలకు ఆచరణకు పొంతన లేకుండా ఉంది. సామాన్య భక్తులకు అందరి కోసం అభిషేక దర్శనం కోసం సేవా టిక్కెట్లను జారీ చేయకుండా అవకాశం కల్పించారు. అయితే మూడవ కాలం ఉదయం 10గంటల సమయంలో జరుగుతుంది. ఈ సమయంలో భక్తుల రద్దీ, తాకిడి అధికంగా ఉంటుంది. దాంతో అభిషేక టిక్కెట్లు జారి చేస్తే దర్శనం కొందరికే పరిమితం అవుతుందని, అలా కాక టిక్కెట్లు జారి చేయకుంటే దర్శన భాగ్యం అందరికి కల్గుతుందనే మహోన్నత ఆశయంతో టిక్కెట్లు జారీ చేయటం లేదు. దీని వల్ల శివయ్య ఆదాయాలకు గండి పడింది. అయితే 'లక్ష్యం' నెర వేరుతుందా? అంటే 'ఫ్' అనే సమాధానం లభిస్తుంది. ఇక్కడ మూడవ కాలం అభిషేకంలో గమనిస్తే అంతరాలయంలో పలుకుబడి రాజ్యమేలుతుంటుంది. ఈ సమయంలో విఐపిల తాకిడితో, విఐపిలను కూర్చొబెడుతున్నారు. అధికారులు, ఆలయంలో పని చేసే ఉద్యోగుల బంధువులను, ఇక ధర్మకర్తల మండలి సభ్యుల బంధువులు, పాలకుల మెప్పు కోసం వివిధ పార్టీల నాయకులు నియమించుకున్న ఉచిత సేవకుల పలుకుబడితో అంతరాలయం భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన దర్శనాలను తరింప చేస్తున్నారు. మహోన్నతాశం, లక్ష్యంతో ఏర్పాటు చేసిన 'దర్శనం' చివరకు పలుకుబడికి దాసోహం అంటుంది. అదేదో సాధారణంగా అన్ని కాలాల అభిషేకాల్లో టిక్కెట్లుతో పాటు జారీ చేస్తే శివయ్యకు ఆదాయం అయినా వస్తుంది కదా అని చర్చించుకుంటున్నారు. ఆలయ అధికారులు, పాలకుల అసంబద్ధ నిర్ణయాలతోనే దళారీలు పెచ్చు పెరిగిపోతున్నారు. టిక్కెట్లు లేకుండా అభిషేకంలో కూర్చున బెడితే దళారీల పంట పండినట్లే అని భక్తులు అంటున్నారు. దళారీ ఊహించిన మూల్యం కన్నా అధికంగా భక్తులు ముట్టచెబుతున్నట్లు వినబడుతున్నది.

**పర్యవేక్షణ లోపమా? ఆచరణ అసాధ్యమా?**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఓ వైపు పాలకులు, మరో వైపు దేవాదాయశాఖ ఎన్నో సంస్కరణలు అమలు చేస్తుంది. అయితే అవి శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఎందుకు సమర్థవంతంగా అమలు చేయలేక పోతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపమా? లేక ఆచరణ అసాధ్యమా? అనేది చర్చనీయాంశంగా మారింది. దళారులను అరికట్టుటకు ప్రభుత్వం ఆన్‌లైన్ అమలు చేసింది. అయితే ఇక్కడ దళారుల దందా ఆగిందా? అంటే రెట్టింపు అయ్యిందని చెప్పవచ్చు. ఎక్కడా దళారుల బెడద తప్పలేదు. ప్రభుత్వం, పాలకులు ఓ నిర్ణయంతో ముందడుగు వేస్తే అదికాస్త 'అక్రమార్కులకు' వరంగా మారుతుంది. అయితే నిర్ణయాల అమలు లోపం ఎక్కడుంది? అధికారి నిత్యం తిరగటం కాదు. ఉద్యోగుల్లో, దళారుల్లో కంటి చూపు భయం ఉండాలని పరిశీలకులు చర్చించుకుంటున్నారు. మరి అ లాంటి అధికారి త్వరలోనే వస్తారనే చర్చ జరుగుతుంది. ఇక్కడకు కంటి చూపుతో గడ గడ లాడించే అధికారి చంద్రశేఖర్ ఆజాద్ వస్తారనే చర్చ సాగుతుంది. తప్పులు మీద తప్పులు చేస్తూ, పవిత్రోత్సవాలు నిర్వహిస్తే పరిణామాలు ఏలావుంటాయో శివయ్యకే ఏరుక. మరి భవిష్యత్తులో ఏం జరుగుతుందో వేచి చూడాలి.

### వినికిడి లోపం...

# ప్రారంభ దశలోనే అరికట్టాలి

**- స్విమ్స్ డీన్, ఇంచార్జ్ డైరెక్టర్ డాక్టర్ అలోక్ సచన్**




తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: అంతర్జాతీయ బధిరుల వారోత్సవాలను పురస్కరించుకుని శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్), తిరుపతిలో శనివారం ఉచిత ఆడియాలజికల్ స్క్రీనింగ్, వినికిడి మదింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. స్విమ్స్ శ్రీ పద్మావతి హాస్పిటల్ నివిగి ఓపీడీ విభాగము నందు నిర్వహించిన ఈ కార్యక్రమంలో వినికిడి సమస్యలు ఉన్న వారికి ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు అందించారు. స్విమ్స్ డీన్, ఇన్చార్జ్ డైరెక్టర్ డా. అలోక్ సచాన్ పాల్గొని మాట్లాడుతూ స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్. గుడారు జగదీష్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, వినికిడి లోపం వ్యక్తి ఆరోగ్యంతో పాటు విద్య, ఉద్యోగం, సామాజిక జీవనంపై కూడా ప్రభావం చూపుతుందని తెలిపారు. ముఖ్యంగా చిన్నారుల్లో వినికిడి లోపాలను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా వారి మాట, భాషా అభివృద్ధికి అవసరమైన చికిత్సను సకాలంలో అందించవచ్చన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా ఇటువంటి అవగాహన, స్క్రీనింగ్ కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా వినికిడి ఆరోగ్యంపై మరింత చైతన్యం తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు. స్విమ్స్ శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ వినికిడి లోపాన్ని నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. పిల్లల్లో వినికిడి సమస్యలను ముందుగానే గుర్తించి తగిన పరీక్షలు, చికిత్స మరియు అవసరమైన పునరావాస సేవలు అందించడం ద్వారా వారి భవిష్యత్ అభివృద్ధికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. విభాగాధిపతి డా. ఎస్.బి. అమర్నాథ్ మాట్లాడుతూ వినికిడి తగ్గడం, చెవుల్లో శబ్దాలు వినిపించడం, మాటలు స్పష్టంగా వినిపించకపోవడం, పిల్లలు పిలిచినప్పుడు స్పందించకపోవడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదన్నారు. వినికిడి సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, ఈ తరహా పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు సూచించారు. వినికిడి లోపాన్ని ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా తగిన చికిత్స అందించి జీవన ప్రమాణాన్ని మెరుగుపరచవచ్చని తెలిపారు.

### సనాతన ధర్మాన్ని ఆచరించే పవన్ గారూ...

# మీ చైర్మెన్‌కు ఆక్రమణలు కనపడవా?

**-శ్రీకాళహస్తిలో సనాతానానికి చెదలు - మాజీ ఎంఎల్ఏ**



ఇఓకు వినతి పత్రం అందిస్తున్న మాజీ ఎంఎల్ఏ

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: పవన్ గారూ! మీ చే నామినేట్ చేయబడిన శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ పరిపాలన అస్తవ్యస్తంగా మారిందని అక్రమాలు జరుగుతున్నా పట్టించుకోరు,అక్రమణలు చేస్తున్నా కనబడదు, ఆలయంలో సంప్రదాయాలకు అపచారాలు జరుగుతున్నా స్పందించరు ఇదేమా 'సనాతన ధర్మ పరిరక్షణ' అంటూ శనివారం శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి శివమెత్తారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న కుమారస్వామి కొండ దిగువ భాగాన తెలుగుదేశం మద్దతుదారుడు యథేచ్ఛగా అక్రమించు కుంటుంటే దేవాదయాశాఖ అధికారులు నిద్రావస్థలో ఉండగా చైర్మెన్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహారించటం భావ్యమా? అని ప్రశ్నించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ డెప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌పై విరుచుకుపడ్డారు. పట్టణ నడిబొడ్డులోని దేవస్థానం ఆస్తుల్ని ఆక్రమించుకుంటున్నారు. అయినా మీచే నామినేట్ చేయబడిన చైర్మెన్ మనకెందుకులే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. మీరేమో సనాతన ధర్మం గురించి ఆచార వ్యవహారాల గురించి దేవాదాయశాఖ ఆస్తుల పరిరక్షణ గురించి గొప్పగా వల్లిస్తుంటారు, కానీ మీ పార్టీ చైర్మెన్ అవన్ని పట్టించుకోకుండా సీటు భద్రం అన్నట్లు వ్యవహారించటం తగునా అని ప్రశ్నించారు.

**ఆక్రమణలపై అధికారులు ఏం చేస్తున్నారు?:**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించి రచ్చ రచ్చ జరుగుతున్నా, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా నెలకు లక్షలకు లక్షలుజీతాలు తీసుకుంటున్న ఇఓ శివయ్య ఆస్తుల్ని హారిస్తున్నా పట్టించుకోక పోవటం వేనుక ఏ రాజకీయ శక్తి అడ్డుకుంటుందని ప్రశ్నించారు. కుమారస్వామి కొండ ఆక్రమణకు పాల్పడుతున్న వ్యక్తి ఎంఎల్ఏకు అనుచరుడైనందువల్ల పట్టించుకోరా? శ్రీకాళహస్తిలో జరుగుతున్న దౌర్జన్యాలకు సంబంధించి శాసనసభ్యుడు ఎందుకు స్పందించటం లేదని ప్రశ్నించారు. మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి వారి అనుచరులతో కలసి ఇఓ బికె వెంకటేశులును ఆయన కార్యాలయంలో కలసినారు. ఈ సందర్భంగా ఆయన ఆక్రమణల గురించి వివరిస్తూ సునిశితంగా శివయ్యకు నష్టం కల్గిస్తే ఎవరినైనా వదలిపెట్టదని గుర్తించుకోవాలన్నారు. అదినువ్వైనా, నేనైనా ఒక్కటే అన్నారు. ఆయనతో పాటు దేవస్థానం మాజీ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, మాజీ బోర్డు సభ్యులు మున్నారాయల్, బుల్లెట్ జయశ్యాం రాయల్,సుమతి,ఉత్తరాజి శరవణ కుమార్, కంఠా ఉదయ్‌కుమార్, సురేష్, తిరుమల చౌదరి, పిఎం చంద్ర,మునికృష్ణారెడ్డి కొట్టె శరవణ, జివికే రెడ్డి,గాదిపాకుల కిరణ్,మని; గుణ తదితరులు పాల్గొన్నారు.

### కుప్పంకు మరోమారు...

# జాతీయస్థాయి ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు

**- పి4 బంగారు కుటుంబం.. నెట్‌జీరో కార్యక్రమాలకు పురస్కారం**
**- న్యూఢిల్లీలో అవార్డు అందుకున్న కడ పి.డి. వికాస్ మర్మత్ -**
**రెండున్నర ఏళ్లలో కుప్పానికి మూడు జాతీయ స్థాయి అవార్డులు**

కుప్పం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంత నియోజకవర్గం కుప్పం సిగలో మరో జాతీయ స్థాయి అవార్డు చేరింది. కుప్పం నియోజకవర్గంలో అమలు చేస్తున్న సిఎం చంద్రబాబునాయుడు మానసపుత్రిక అయిన పి4బంగారు కుటుంబం, నెట్ జీరో కార్యక్రమాలకు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన స్కోచ్ అవార్డు లభించింది. ఈ కార ్యక్రమాన్ని కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) ద్వారా అమలు చేయడంతో కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ఈ పురస్కారాన్ని దేశ రాజధాని న్యూఢిల్లీలో శనివారం జరిగిన 109వ స్కోచ్ సమ్మిట్ కార్య క్రమంలో అందుకున్నారు.పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు అవార్డు కార్యక్రమంకు హాజరయ్యారు. స్వర్ణకుప్పం విజన్ 2029లో భాగంగా కుప్పం నియోజకవర్గంలోని పేద కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు పి4 బంగారు కుటుంబం-మార్గదర్శి కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. పేదరిక నిర్మూలన, పేదలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగుతోంది. కడ అధికారులు, సిబ్బంది చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. ఇప్పటికే కుప్పం నియోజకవర్గంలో 9804 బంగారు కుటుంబాలను ఎంపిక చేశారు. వీరిలో సుమారు 1217 కుటుంబాలకు ఇప్పటికే ప్రముఖ కార్పొరేట్ సంస్థలైన మేఘా ఇంజనీరింగ్ కంపెనీ, అదాని గ్రూప్స్, టివిఎస్‌ల సహకారంతో సుమారు 8.71కోట్ల వ్యయంతో వారికి అవసరమైన ఉపాధి అవకాశాలు కల్పించడంలో సక్సెస్ సాధించారు. డెయిరీ, గొర్రెలు, చిరువ్యాపారాలు, ఆటోలు, మినీఫ్లోర్ మిల్లులు, దుస్తుల దుకాణాలు, వ్యవసాయం తదితర ర ంగాల్లో సాయం అందించారు. మిగతా కుటుంబాలకు కూడా విడతల వారీగా కార్పొరేట్ సంస్థల సహకారంతో ఆర్థికంగా చేయూత అందించి పేదలు తమ కుటుంబాల ఆర్థికస్థితిని మెరుగుపరచుకునేలా సిఎం చంద్రబాబు చర్యలు చేపట్టారు. పి4 కార్యక్రమంకు స్కోచ్ అవార్డుతో జాతీయ స్థాయిలో గుర్తింపు మరింత లభించింది. అలాగే నెట్ జీరో నియోజకవర్గ ంగా కుప్పాన్ని అభివృద్ధి చేసేలా కడ ఐఐటి కాన్పూర్ సహకారంతో ముందుకు సాగుతోంది. గృహాలకు రూఫ్‌టాప్ సోలార్, వ్యవసాయ పంప్‌సెట్లకు సౌర విద్యుత్, విద్యాసంస్థల్లో సౌర విద్యుత్ వాడకం, స్మార్ట్ మీటరింగ్ కార్యక్రమాలు చేపట్టారు.



న్యూఢిల్లీలో స్కోచ్ పురస్కారాన్ని అందుకుంటున్న కడ పి.డి.వికాస్ మర్మత్, పికెఎం ఉడా ఛైర్మన్ బిఆర్ సురేష్‌బాబు

**రెండున్నర ఏళ్లలో మూడు జాతీయ స్థాయి అవార్డులు :**

కుప్పం నియోజకవర్గానికి గడచిన రెండున్నర ఏళ్లలో జాతీయ స్థాయిలో మూడు అవార్డులు లభించాయి. కుప్పంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సిఒఇ)కు దేశంలోనే అత్యుత్తమ హార్టికల్చర్ హబ్‌గా గుర్తించి ఇదివరకే ప్రతిష్టాత్మక 'స్కోచ్ ' అవార్డును అందించారు. ఇటీవలే కుప్పం మండలం బ్లాక్‌లోని నాయనూరు పంచాయతీకి 'నానాభాయ్ దేశ్‌ముఖ్ సరో ్వత్తమ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్' సైతం లభించింది. తాజాగా కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ)కు ప్రతిష్టాత్మక 'స్కోచ్ ' అవార్డు లభించడం విశేష ం.

# వామ్మో.. మామూలుగా లేదప్పా ఎవ్వారం

-కుప్పం మున్సిపల్ ఛైర్మన్ సీటుకై చాంతాడంత జాబితా
-అధికార తెదేపా తరపున 22 మంది ఆశావహులు దరఖాస్తులు

కుప్పం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:



కుప్పం మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిత్వ ం వ్యవహారం మామూలుగా లేదు. సిఎం చంద్రబాబునాయుడు, తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండడంతో పాటు సిఎం సొంత నియోజకవర్గంలోని మున్సిపాలిటీ అయిన నేపథ్యంలో అధికార తెలుగుదేశం పార్టీ తరపున ఛైర్మన్ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తూ ఆశావహులు చాంతాడంత మంది తమ దరఖాస్తులను అందజేశారు. ఏకంగా దాదాపు 22మంది తమకు ఛైర్మన్ అభ్యర్థిత్వం ఇవ్వాలని కోరుతూ పార్టీ అధిష్టానంకు దరఖాస్తులు సమర్పించారు. శుక్రవారం రాత్రి వరకు సైతం కుప్పం తెదేపా కార్యాలయంలో ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, సిఎం పిఎ శ్రీకాంత్, టిడిపి మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం దరఖాస్తులను స్వీకరించారు. మున్సిపల్ పరిధిలో వివిధ ప్రాంతాలకు చెందిన 22మంది దరఖాస్తులు అందించగా వారిలో సీనియర్లు, ప్రస్తుత కౌన్సిలర్లు సైతం ఉండడం విశేష ం. మాజీ సర్పంచ్ గోపీనాథ్, కడ సభ్యుడు రాజ్‌కుమార్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యే ంద్రశేఖర్, కార్పోరేషన్ డైరెక్టర్లు తిరుమగళ్, వేణుగోపాల్, సీనియర్ మైనార్టీ నేత హిదయతుల్లా, కౌన్సిలర్లు జిమ్‌దాము, సోమశేఖర్, సురేష్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాకీర్, రెస్కో డైరెక్టర్ ఆర్ముగం తదితరులతో పాటు మరో పదకొండు మంది వెంకటేష్‌లు ఛైర్మన్ గిరి ఆశిస్తున్న ఆశావహులనుంచి ఆశావహులు తమ దరఖాస్తులను అందజేశారని తెలిసింది. ఈ దరఖాస్తులన్నీ శనివారం చిత్తూరులోని జిల్లా పార్టీ కార్యాలయంకు చేరాయి. కాగా మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తూ మరికొందరు కూడా అంతర్గత ంగా పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిత్వం ప్రస్తుతం తెదేపా వర్గా ల్లో హాట్ టాఫిక్ అయింది.

**మున్సిపాలిటీ రిజర్వేషన్‌పై ఉత్కంఠ :** కుప్పం మున్సిపాలిటీ ఎన్నికలకు ఈ దఫా ఏ రిజర్వేషన్ వర్తిస్తుందోననే ఉత్కంఠ ఆయా పార్టీల నేతల్లో నెలకొంది. 2021లో కుప్పం మున్సిపాలిటీ తొలిసారిగా ఏర్పడి ఎన్నికలు జరిగిన సమయంలో ఛైర్మన్ పదవి జనరల్ కేటగిరీకి రిజర్వు అయింది. ప్రస్తుతం 2026లో జరిగే ఎన్నికలకు రిజర్వేషన్ జనరల్ ఉంటుందా లేక బిసి మహిళలు, లేక ఎస్సీలకు రిజర్వేషన్ అవుతుందా అనే ఉత్కంఠ ఏర్పడింది. కాగా 2021 ఎన్నికలనాటికి కుప్పం మున్సిపాలిటీలో 25 వార్డులు ఉండగా ప్రస్తుతం 32 వార్డులు ఏర్పడ్డాయి.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## అంగస్తంభన సమస్యలకు 'పెనైల్ ఇంప్లాంట్లు' సమర్థవంతమైన చికిత్స

- మణిపాల్ హాస్పిటల్ యూరాలజిస్ట్ డా. నవీన్‌కుమార్‌రెడ్డి




**చిత్తూరురూరల్, సెప్టెంబరు 26 ప్రభాతవార్త:** 40 ఏళ్లు దాటిన పురుషుల్లో అత్యంత సాధారణంగా కనిపించే ఆరోగ్య సమస్యల్లో అంగస్తంభన ఒకటని, ఈ సమస్యతో సాధారణ మందులు పనిచేయని వారు సమర్థవంతమైన పెనైల్ ఇంప్లాంట్లు చికిత్సతో లైంగిక సామర్థ్యాన్ని పునరుద్ధరించు కోవచ్చునని మణిపాల్ హాస్పిటల్ బెంగళూరుకు చెందిన కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డా. నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మధుమేహం, రక్తపోటు, రక్తనాళాల సమస్యలు వున్న వారిలో దీని ప్రభావం ఎక్కువగా వుంటుందని, అంగస్తంభన సమస్యను నిర్లక్ష్యం చేయకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అంగస్తంభన సమస్యలను కేవలం లైంగిక సమస్యగా మాత్రమే చూడకుండా ఇతర ఆరోగ్య సమస్యలకు కూడా సంకేతం కావచ్చునన్నారు. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ధమనులతో పోలిస్తే పురుషాంగంలోని రక్తనాళాలు మరింత సన్నగా వుంటాయని, రక్తనాళాలకు సంబంధించిన సమస్యలు మొదట అంగస్తంభనపై ప్రభావం చేసే అవకాశం వుంటుందన్నారు. పెనైల్ ఇంప్లాంట్లు సమర్థవంతమైన, దీర్ఘకాలిక చికిత్సా మార్గమని, ఆధునిక ఇంప్లాంట్లు శరీరం లోపల అమర్చబడతాయని, బయటకు కనిపించవని తెలిపారు. దీనిపై ఇప్పటికీ బహిరంగంగా మాట్లాడేందుకు చాలామంది పురుషులు సంకోచిస్తున్నారని, అంగస్తంభన సమస్యతో జీవితాంతం బాధపడాల్సిన అవసరం లేదని, సరైన చికిత్సతో లైంగిక సామర్థ్యాన్ని పునరుద్ధరించుకోవచ్చునని డా. నవీన్ తెలిపారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం



పెనుమూరు, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు వైకాపా నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మహాసముద్రం దయాసాగర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని పులికల్లు గ్రామంలోని మహాసముద్రం దయాసాగర్‌రెడ్డి స్వగృహంలో శనివారం వైకాపా కార్యకర్తలకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహాసముద్రం దయాసాగర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ఐదేళ్ళపాటు రాష్ట్రంలో అధికారంలో వున్న వైకాపా అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళాలని, అలాగే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చి అమలు చేయని పథకాల గురించి క్షేత్ర స్థాయిలో వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఐదేళ్ళ పాటు రాష్ట్రంను పరిపాలించిన జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రజా సంక్షేమం అమలులో తన మార్కు వేసుకున్నారన్నారు. ఈ విషయంను ప్రజల్లోకి తీసుకెళ్ళి స్థానిక సంస్థల ఎన్నికల్లో వైకాపా బలపరచిన అభ్యర్థులను గెలిపించడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమంను పూర్తిగా విస్మరించిందని, రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు అంటూ రెండున్నర సంవత్సరాల పాటు కూటమి ప్రభుత్వం కాలక్షేపం చేసిందన్నారు. అలాగే సూపర్ సిక్స్ అట్టర్ ప్లాప్ అయ్యిందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో వైకాపా అభ్యర్థుల విజయంతో ఈ విషయం తేటతెల్లం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైకాపా కన్వీనర్ కామసాని విజయకుమార్‌రెడ్డి, వైకాపా నాయకులు కారేటి గోవిందరెడ్డి, దూది మోహన్, కంచర్ల చక్రవర్తినాయుడు, అగ్రహారం నరసింహారెడ్డి, లోకేష్‌రెడ్డి, గంధం ముని, పులిచెర్ల ఈశ్వర్‌రెడ్డి, వీరభద్రయ్య, దూది త్యాగరాజు, మాజీ జడ్పీటీసీ దొరస్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## హంద్రీ-నీవా నీటిని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

**కుప్పం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** హం ద్రీ-నీవా కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు ప్రస్తుతం వస్తున్న నీటిని ఎవరైనా అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేయడం జరుగుతుందని అధికారులు ప్రకటనలో పేర్కొన్నారు. కుప్పం బ్రాంచ్ కెనాల్ వెంబడి ఉన్న మేజర్ ఇరిగేషన్ చెరువులకు సిఎం చంద్రబాబునాయుడు రెండోదఫా నీరు అందించాలని ఇటీవలే గుండిశెట్టిపల్లి వద్ద కృష్ణమ్మకు జలహారతి నిర్వహించారన్నారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో శ్రీశైలం డ్యామ్‌లో సైతం నీటి కొరత ఉందన్నారు. దీంతో ఈ సీజన్‌లో నీటిని కేవలం తాగునీటి అవసరాలకు వినియోగించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. కుప్పం నియోజకవర్గంలో ప్రజలు, పశువులకు తాగునీరు అందించేందుకు గాను అక్టోబర్ 15లోగా మొదటి దశ చెరువులు నింపడం జరుగుతుందన్నారు. తాగునీటి బోర్లను రీచార్జ్ చేసేందుకు చెరువులు నింపేందుకు మలివిడత అక్టోబర్ 15-నవంబర్ 15 వరకు నీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు. కుప్పం బ్రాంచ్ కెనాల్ వెంబడి ఉన్న మిగిలిన చెరువులకు మూడో విడతలో నవంబర్ 15నుంచి నీటిని సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో రైతులు మేజర్ ఇరిగేషన్ చెరువులనీటిని సాగునీటికి ఉపయోగించరాదన్నారు. ఆఫ్‌టేక్, పైపుల ద్వారా, ఎలక్ట్రిక్, డీజిల్ పంప్ సెట్ల ద్వారా ఎయిర్ వాల్వ్‌ను తెరవడం ద్వారా నీటిని తోడరాదన్నారు. కాలువ ఒటిల వద్దకు వచ్చినా నీటిని అక్రమంగా తరలించేవారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు, రైతులు ఎవరూ ఒటి పాయింట్ల వద్దకు వెళ్లరాదని సూచించారు.

## పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు

**కుప్పం, సెప్టె ంబర్ 26 ప్రభాతవార్త:** ప్రభుత్వం రైతులకు కల్పిస్తున్న పశుబీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు కోరారు. ఒక కుటుంబానికి గరిష్టంగా పదిఆవులకు పశుబీమా వర్తిస్తుందన్నారు. ఒసారి బీమా చేస్తే మూడేళ్ల వరకు పథకం వర్తిస్తుందన్నారు. పశువులకు చెవిపోగు వేయించి బీమాలో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం నాటు పశువులకు రూ 816, మేలుజాతి పశువులకు 1632రూ.లు చెల్లిస్తుందన్నారు. ఎసీ ్స,ఎస్టీ, బిసి, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న రైతు కుటుంబాలు పశుబీమా పథకంలో లబ్ది పొందవచ్చన్నారు. రూ15వేలు మొదలు 1లక్ష రూపాయల దాకా పశువుకు బీమా చేయవచ్చన్నారు. రైతులు వివరాలకు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు.

## ఘనంగా షణ్ముగం జన్మదిన వేడుకలు



**చిత్తూరురూరల్, సెప్టెంబరు 26 ప్రభాతవార్త:** జాతీయ బిసి సంక్షేమ సంఘ ప్రధానకార్యదర్శి పి.షణ్ముగం జన్మదిన వేడుకలను సంఘ నాయకులు ఘనంగా నిర్వహించారు. శనివారం ఏఎస్ఎం మున్సిపల్ కాంప్లెక్స్‌లోని బిసి సంక్షేమ సంఘ కార్యాలయంలో షణ్ముగం సంఘ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, అభిమానులు ఆయనను శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## అక్టోబర్ 2న గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌పై రీల్, వీడియో పోటీ

చిత్తూరుహెల్త్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: రాయలసీమను ప్రపంచ ఉద్యాన కేంద్రంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో చేపడుతున్న 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్- రాయలసీమ రైజింగ్-రాయలసీమ విజయీభవ' కార్యక్రమంపై సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, వీడియో మేకర్లు, విద్యార్థులు ఇతర ఆసక్తి వున్నవారు రీల్, వీడియో పోటీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. రాయలసీమ, ప్రకావం, మార్కాపురం ప్రాంతాల్లో భారతదేశపు గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసే విధానంను సృజనాత్మకంగా, వినూత్నంగా ప్రజలకు వివరించేలా వీడియోలను రూపొందించాలని కలెక్టర్ సూచించారు. ఒక జిల్లా లేదా ఒక ఉద్యాన ఉత్పత్తిని ప్రధాన అంశంగా తీసుకుని వీడియో రూపొందించవచ్చునన్నారు. 60 నుండి 90 సెకన్ల వ్యవధి కల్గిన రీల్, వీడియోలను సెప్టెంబర్ 26 నుండి 30వ తేదీ మధ్యాహ్నం 12 గంటల్లోపు వివిధ సామాజిక మాధ్యమ వేదికల్లో పోస్ట్ చేయాలని కలెక్టర్ సూచించారు. ఎంపికన ఐదు ఉత్తమ వీడియోలను మదనపల్లిలో అక్టోబర్ 2వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటన సందర్భంగా 50 వేల మంది ప్రజల సమక్షంలో ఈ వీడియోలను ప్రదర్శించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఎం నారా చంద్రబాబునాయుడుతో పాటు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌లు హాజరై వీడియోలను తిలకరిస్తారన్నారు. సెప్టెంబర్ 30వ తేదీలోపు విజేతలను ఖరారు చేసి అక్టోబర్ 1 తేదీన వారికి సమాచారం అందించి అక్టోబర్ 2వ తేదీన బహుమతిని అందజేయడం జరుగుతుందన్నారు.

## పెరటితోటల పెంపకం ఎంతో లాభదాయకం : ఎంపిడిఒ




**కుప్పం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :** ప్రజలు, మహిళలు నివాస గృహాల వద్ద పెరటి తోటలు (కిచెన్ గార్డెన్)పెంపకంపై మక్కువ చూపాలని ఎంపిడిఒ రాజే ంద్రప్రసాద్ కోరారు. శనివారం మండల కార్యాలయంలో స్వయం సహాయక సంఘాలకు చెందిన సభ్యులకు, సంఘమిత్రలకు కిచెన్ గార్డెన్ మరియు హోం కంపోస్టింగ్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. పెరటితోటల పెంపకంతో ప్రజలు స్వచ్ఛమైన కూరగాయలను తమ ఇళ్ల వద్దనే సాగు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. తద్వారా చక్కటి ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. రసాయనాలు వాడని పెరటితోటలతో ఎంతో ఉపయుక్తం కలుగుతుందన్నారు. 29న ఇదే అంశంపై పిడిఒలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఎపిఎం చంద్రశేఖర్, ఆర్‌పి శివశంకర్, వెలుగు సిసిలు, డ్వాక్రా మహిళలు, సంఘమిత్రలు, ఎస్‌హెచ్‌జి సభ్యులు పాల్గొన్నారు.

## శాశ్వత నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం



కాణిపాకం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు శనివారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు గుంటూరు తాడేపల్లెకు చెందిన సోమసత్య శ్రీనివాసరావు అనే భక్తుడు శాశ్వత నిత్యాన్నదాన పథకంకు 1,01,116 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తా_న్ని కుటుంబసభ్యులతో కలిసి ఆలయ టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడుకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## గణనాథునికి వెండి పుష్పమాల విరాళం



కాణిపాకం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారి దేవస్థానంకు ఓ భక్తుడు శనివారం వెండి పుష్పమాలను విరాళంగా అందజేశారు. ఈమేరకు కారంచేడు జిల్లా బాపట్లకు చెందిన మల్లయ్య, రాజ్యలక్ష్మి దంపతులు సుమారు కిలో వెండితో 2.50 లక్షలు రూపాయలు వెచ్చించి స్వామివారికి ప్రత్యేకంగా తయారు చేయించిన పుష్పమాలను విరాళంగా అందజేశారు. అలాగే నిత్యాన్నదాన పథకంకు లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ వాటిని కుటుంబసభ్యులతో కలిసి ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడులకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## సమావేశం ఎందుకో అధికారులకే తెలియదా?




**పూతలపట్టు, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** మండల పరిషత్ కార్యాలయంలో డ్వాక్రా సభ్యులకు కిచెన్ గార్డెన్, కంపోస్టింగ్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించిన ఘటనలో అధికారుల సమాధానాలు చర్చనీయాంశంగా మారాయి. డ్వాక్రా సభ్యులకుఉపయోగకరమైన అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో, కార్యక్రమంలో ఏ అంశాలపై అవగాహన కల్పిస్తున్నారో తెలుసుకునేందుకు విలేకరి ఎంపీడీవోను వివరణ అడగగా అయితే సమావేశం గురించి అడగగా నాకు తెలియదు అంటూ ఎంపీడీవో సమాధానం ఇచ్చినట్లు సమాచారం.అనంతరం వెలుగు అధికారిని సమావేశం గురించి వివరణ అడగగా, ఎంపీడీవో సార్ చెబితేనే నేను సిబ్బందిని పంపించాను అని సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. ఒక అధికారి సమావేశం గురించి తనకు తెలియదని చెప్పడం, మరో అధికారి ఎంపీడీవో చెప్పడంతోనే కార్యక్రమానికి సిబ్బందిని పంపినట్లు చెప్పడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయంలో డ్వాక్రా సభ్యుల కోసం అధికారికంగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంపై సంబంధిత అధికారులకే స్పష్టమైన సమాచారం లేకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను నిర్వహించే సమయంలో సంబంధిత శాఖల మధ్య సమన్వయం ఉండాలని, కార్యక్రమం ఉద్దేశ్యం, నిర్వహణ బాధ్యతలు, శిక్షణ అంశాలపై అధికారులకు స్పష్టత ఉండాలని స్థానికులు కోరుతున్నారు. కార్యక్రమం నిర్వహణపై అధికారిక సమాచారం ఏమిటి? ఎవరి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది? అనే విషయాలపై ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## యువకుడి ఉపాధికై కంప్యూటర్ వితరణ




**కుప్పం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** గుడుపల్లె మండలం పెద్దగొల్లపల్లికి చెందిన విజయ్ అనే యువకుడు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఇతను నిలబడలేని నడవలేని స్థితిలో ఉ ండడంతో కుప్పం, శాంతిపురం లయన్స్‌క్లబ్‌లు ముందుకు వచ్చి 25వేలు విలువ చేసే కంప్యూటర్, ప్రి ంటర్‌ను అతనికి అందించారు. విజయ్ తన ప్రతిభ ద్వారా స్వయం ఉపాధి పొందాలని లయన్స్‌క్లబ్ సలహాదారు మహేష్ ఆకాంక్షించారు. లయన్ ఉమాపతి, కార్పోరేషన్ డైరెక్టర్ తిరుమగళ్ తదితరులు పాల్గొన్నారు.

## అర్థగిరిలో వైభవంగా పౌర్ణమి వేడుకలు

**తవణంపల్లె, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరగొండ అర్థగిరి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో శనివారం పౌర్ణమి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ప్రతి నెలా ఆలయంలో పౌర్ణమి వేడుకలు నిర్వహిస్తుంటారు. ఈమేరకు ఆలయ ఛైర్మన్ ఎ.రఘుపతి, ఈఓ ఇ.మునిశేఖర్‌ల ఆధ్వర్యంలో ఈవేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో అర్చకులు ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే అర్చకులు ఉదయం 11 గంటలకు ఆలయ మండపంలో సుదర్శనహోమం, ఆకుపూజ, వడమాలసేవ, మధ్యాహ్నం సహస్రనామార్చన, ఆకుపూజ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే రాత్రి స్వామివారికి ప్రాకారోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈమేరకు అలంకరించిన స్వామివారిని ప్రత్యేక పల్లకిపై వుంచి ఆలయం, సంజీవరాయని పుష్కరిని చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఈసందర్భంగా భక్తుల కాలక్షేపం నిమిత్తం పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే భక్తులకు అన్నదానం నిర్వహించడంతో పాటు తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## ఆముదాల సభాపతి మృతి బాధాకరం....



ఓబులవారిపల్లి 26 సెప్టెంబర్ ప్రభాతవార్త

ఓబులవారిపల్లి మండలం సీఎం బలిజపల్లి గ్రామానికి చెందిన ఆముదాల సభాపతి. మృతి బాధాకరమని. కూడా ఛైర్మన్ టిడిపి ఇంచార్జ్ ఒక్కరూపానంద రెడ్డి సతీమణి. వరలక్ష్మి అన్నారు. శనివారం మృతుడు పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి అన్ని విధాల అండగా ఉంటాం అన్నారు అన్నారు అనంతరం .కుటుంబ సభ్యులను పరామర్శించారు ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు ఈ కార్యక్రమంలో కార్యకర్తలు కూటమి నాయకులు పాల్గొన్నారు

## గర్భిణులు..బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



- కడ సభ్యుడు రాజ్‌కుమార్

**కుప్పం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలికలు, చిన్నారుల ఆరోగ్యంపై అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు శ్రద్ధ చూపాలని కడ సభ్యుడు రాజ్‌కుమార్ సూచించారు. శనివారం పోషణమాసం -2026లో భాగంగా ఐసిడిఎస్ ప్రాజెక్టు అధ్వర్యంలో చేపట్టిన అంగన్‌వాడీ ఉత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సకాలంలో గర్భిణులు, బాలి ంతలు, పిల్లలకు పౌష్టికాహారంను అందించడంతో పాటు వారికి ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల పట్ల ఆప్యాయంగా వ్యవహరి ంచాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పరమహంసలో మానసిక ఆరోగ్యం పై శిక్షణ



**శాంతిపురం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** స్థానిక శ్రీ పరమహంస యోగానంద విద్యాలయలో విద్యార్థుల మానసిక ఆరోగ్యం పై సీబీఎస్ఈ శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. నిర్వహించారు ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్ గా పెద్దపంజాణిలోని మదర్ తెరిసా స్కూల్ ప్రిన్సిపల్ డేవిడ్ ,బెంగళూరు దేవనహళ్లిలోని ఇండియన్ స్కూల్ ఫర్ గ్లోబల్ మైండ్స్ ప్రిన్సిపల్ చంద్ర శివకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విద్యార్థుల మానసిక ఆరోగ్యం వారి భావోద్వేగాలను ఉపాధ్యాయులు అర్థం చేసుకోవలసిన అవసరం గురించి వివరించారు. విద్యార్థులతో ఎలా మెలగాలి, వారికి ఎలాంటి విషయాలు బోధించాలి అనే అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ప్రిన్సిపల్ ఆజాద్ హుస్సేన్ ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కుప్పం హాకింగ్ స్కూల్, వీకోట వాణి స్కూల్, పరమహంస యోగానంద విద్యాలయ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సిఎం చొరవతో గ్రామీణ ఆలయాలకు మహర్దశ

- ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం



**రామకుప్పం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతో కుప్పం ప్రాంతంలో ఆలయాలకు మహర్దశ లభిస్తోందని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. శనివారం రాజుపేట గ్రామంలో శ్రీవాణి ట్రస్ట్ నిధులు 25లక్షలతో శ్రీ నల్లగ ంగమ్మ ఆలయ నిర్మాణంకు ఆయన భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కుప్పం నియోజకవర్గంలో సుమారు 140 ఆలయాలను శ్రీవాణి ట్రస్ట్ నిధులతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం సహకారంతో ఆలయాలను ముఖ్యమంత్రి ఆదేశాలతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఆలయాలు త్వరగా నిర్మించాలని సూచించారు. కార్యక్రమంలో సిఎం పిఎ శ్రీకాంత్, మండల అధ్యక్షుడు వెంకటరమణ, నేతలు కామరాజు నాయక్, నరసింహులు, సీతాపతి, కృష్ణనాయక్, రవిరెడ్డి, రఘు, మురళీమోహన్, నారాయణస్వామి పాల్గొన్నారు.

## విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి




**శాంతిపురం,సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చిత్తూరు ఈగల్ శాఖకు చెందిన పోలీస్ బృందం పేర్కొంది. శనివారం పల్లె బాటలో ఈగల్ రచ్చబండ ద్వారా ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇతర మత్తుపదార్థాల వల్ల విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభ్యాసం, భవిష్యత్తుపై కలిగే అనర్థాల గురించి వివరించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రాళ్ల బూదుగూరు ఎస్సై నరేష్ సిబ్బంది పాల్గొన్నారు .

## అన్నమయ్య జిల్లాలో 115 మద్యం షాపులు :: జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ మధుసుదన్



రైల్వేకోడూరు రూరల్ సెప్టెంబర్ 26(ప్రభాతవార్త)::

అన్నమయ్య జిల్లాలో మద్యం షాపులు కేటాయింపు ప్రక్రియ అత్యంత వేగవంతంగా చేస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ మధుసూదన్ పేర్కొన్నారు. శనివారం రైల్వేకోడూరు మండలంలోని ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో మొత్తం 115 మద్యం షాపులు ఉండగా అందులో 90 షాపులు నిర్ణీత గడువులోగా రెన్యువల్ చేసుకుంటున్నాయని అన్నారు మిగిలిన షాపులో కాల పరిమితి ఈనెల 30 తో ముగిస్తుందని కొత్తగా కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. దరఖాస్తుదారులు ఆన్లైన్ ద్వారా ఆన్లైన్లోనే దరఖాస్తు చేయాలని సూచించారు. ఒక్కొక్క దరఖాస్తుకు 3 లక్షల నాన్ రెఫండబుల్ ఫీజుతోపాటు 1000 రూపాయలు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. అక్టోబర్ ఒకటవ తేదీ అర్ధరాత్రి వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వారు తెలిపారు. అక్టోబర్ 5న లాటరీ ద్వారా విజయతలను ఎంపిక చేయనున్నట్లు అదేరోజు లైసెన్స్ కూడా జారీ చేస్తామన్నారు. కోడూరు ఎక్సైజ్ పరిధిలో 9 షాపులకు నోటిఫికేషన్ ఇవ్వగా చిట్వేలి ఓబులవారిపల్లి మండలాలలో ఒక్కొక్క షాపు ఉన్నట్లు వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోడూరు ఎక్సైజ్ సీఐ టీ కే తులసి, ఎస్ఐ అబ్దుల్ ఖాన్ సిబ్బంది పాల్గొన్నారు.

## టీచర్లకు గడువు ఇవ్వండి

- రాష్ట్ర వైఎస్ఆర్‌టిఎ వర్కింగ్ ప్రెసిడెంట్ వి.రెడ్డిశేఖర్‌రెడ్డి

**చిత్తూరుహెల్త్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు నిధి పోర్టల్ నందు సేవా రిజిస్టర్(ఎస్ఆర్) నమోదుకు గడువు ఇవ్వాలని రాష్ట్ర వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వి.రెడ్డిశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ నెల 30వ తేదీలోపు ఉపాధ్యాయులందరూ తమ సేవా రిజిస్టర్లను అప్‌లోడ్ చేయాలని ఆర్థిక శాఖ ఆదేశించిందని, అయితే రాబోవు 20 రోజుల పాటు పాఠశాలల్లో ఎస్ఎంసి ఎన్నికలు, ఎఫ్ఎ-2 పరీక్షల నిర్వహణ, టెట్ పరీక్షలకు హాజరు తదితర పనులు వున్నందున ఉపాధ్యాయులకు వీలు పడదన్నారు. ఆర్థిక శాఖ నిధి పోర్టల్‌లో వివిధ అంశాలు నమోదు కష్టతరంగా వుందని విమర్శించారు. సీనియర్ ఉపాధ్యాయులకు మ్యారేజ్ సర్టిఫికేట్ లేదని, వారు ఎలా అప్‌లోడ్ చేస్తారని ఆయన మండి పడ్డారు. నిబంధనలు సవరించి ప్రతి ఉద్యోగికి వారి ఆఫీసులోనే ఈఎస్ఆర్ నమోదుకు డ్రాయింగ్ అధికారులు తగు ఏర్పాటు చేయాలని, ఆర్థిక శాఖ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## చెడు వ్యసనాలకు దూరంగా ఉండండి

రామకుప్పం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: విద్యార్థుల దశలోని చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై మారెప్ప పేర్కొన్నారు. శనివారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. గంజాయి, సారాయి, ఇతర మత్తు పదార్థలపై పలు సూచనలు చేశారు. బాల్యంలోనే వాహనాలు నడపరాదని, రోడ్డు భద్రత ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పులికాట్ సరిహద్దు వివాదాలపై...చట్టబద్ధమైన శాశ్వత పరిష్కారం

-ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: పులికాట్ సరస్సు పై ఆధారపడి జీవిస్తున్న వేలాది మత్స్యకార కుటుంబాల హక్కులను ఆత్మ గౌరవాన్ని కాపాడమే ప్రధాన లక్ష్యమని, ఇందులో భాగంగా సరిహద్దు వివాదాలకు చట్టబద్ధమైన శాశ్వత పరిష్కారం చూపే దిశగాకృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శనివారం తమిళనాడులోని గుమ్మడి పూండిబీడీఓ కార్యాల యంలో నిర్వహించిన ఉమ్మడి రాష్ట్రాలప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, మత్స్యకారుల నాయకులతో ఉన్నత స్థాయి ద్వైపాక్షిక సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యకార సమస్యలపై ఇరు రాష్ట్రాల ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులతో చర్చించి సంస్థ నిర్ణయం తీసుకుంటామని ఆమె తెలిపారు. అలాగే ఈ సమావేశంలో పులికాట్ సరస్సులోని సరిహద్దుల విషయంలో ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాల మత్స్యకారులు మధ్య వివాదాలు తలెత్తకుండా సముద్ర, పులికాట్ సరస్సు సరిహద్దులను శాస్త్రీయంగా నిర్ధారించి స్పష్టమైన బౌండ్రి ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రెండు రాష్ట్రాల మత్స్యకారుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకొని శాంతియుత సహజీవనాన్ని అలవర్చేలా ఫ్రీ జోన్ ఏర్పాటు చేయాలని మత్స్యకారుల సంఘ ప్రతినిధుల ప్రతిపాదించగా ఇందుకు అధికారులు సానుకూలంగా స్పందించి తగువిధంగా చర్యలు చేపడ తామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఎలాంటి ఘర్షణలకుతావు లేకుండాఇరు రాష్ట్రాల పోలీస్, ఇతర అధికార యంత్రాంగం నిరంతరం పర్యవేక్షణతో సమన్వయంతో పని చేయాలని నిర్ణయం తీసుకున్నారు. శాంతి భద్రతలు విషయంలో రాజీ లేని విధంగా ఉమ్మడిగా పర్యవేక్షించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో పొన్నేరి ఎమ్మెల్యే డాక్టర్ ఎమ్మెస్ రవి, తిరువల్లూరు జిల్లా కలెక్టర్ ఎస్. కవిత, తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ఆర్ గోవిందరావు, తిరుపతి జిల్లా అదనపు ఎస్పీ రవి మనోహరాచారి, సూళ్లూరుపేట ఆర్డీవో దేవేందర్ రెడ్డి, నాయుడుపేట డిఎస్పి జి చెంచు బాబు, సూళ్లూరుపేట సీఐ ఎం. మురళీకృష్ణ, తడ ఎస్సై కొండప్ప నాయుడు, తాసిల్దార్ శైల కుమారి, రాష్ట్ర బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన శ్రీధర్, ఇరు రాష్ట్రాల రెవెన్యూ, పోలీస్, మత్స్యశాఖ అధికారులు, మత్స్యకార ప్రతినిధులు హాజరయ్యారు.

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు






కాణిపాకం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం భక్తుల కాలక్షేపం నిమిత్తం ఏర్పాటు చేసిన పలురకాల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతో ఆకట్టుకున్నాయి. శనివారం జరిగిన విమానోత్సవం సందర్భంగా స్థానిక ఆస్థాన మండపంలో దేవస్థానం, ఉభయదారుల సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ప్రముఖ కళాకారులచే ఉదయం నుండి రాత్రి వరకు పలురకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈమేరకు హరికథలు, భక్తిగీతాలు, కూచిపూడి, భరతనాట్యం, పౌరాణిక నాటక ప్రదర్శనలు, కోలాటాలు, చెక్కభజనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమాలు ఆహుతులను ఎంతో ఆకట్టుకున్నాయి.

**కాణిపాకంలో నేడు (ఆదివారం)**

పగలు : అభిషేకం రాత్రి : సూర్యప్రభ వాహనసేవ , ఉభయదారులు : కీ॥శే॥శ్రీమతి రాజమ్మ అండ్ కీ॥శే॥ సి.రాజశేఖర్‌నాయుడు గార్ల కుమారులు, సి.ఇంద్రసేననాయుడు, అండ్ శ్రీ సి.లక్ష్మీపతినాయుడు, 44 బొమ్మసముద్రం.స్థానిక ఆస్థాన మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు: ఉదయం 10 గంటల నుండి అర్ధరాత్రి 1 గంటల వరకు ప్రవచనములు, భరతనాట్యం, కూచిపూడి, హరికథలు,పౌరాణిక నాటక ప్రదర్శనలు, గ్రామోత్సవం ప్రారంభమైనప్పటి నుండి పలు బృందాలచే కోలాటాలు, చెక్కభజనలు, వంటి సాంస్కృతిక కార్యక్రమాలు.

## కాణిపాకంలో శాస్త్రసోక్తంగా సత్యనారాయణవ్రతం



కాణిపాకం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి ఆలయం లో శనివారం సత్యనారాయణ వ్రతంను శాస్త్రోక్తంగా అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రధాన ఆలయం అనుబంధ ఆలయమైన శ్రీశ్రీదేవి భూదేవి సమేత వరదరాజస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఈవ్రతాన్ని నిర్వహి ంచారు. ఆలయ మండపంలో ఈవ్రతాన్ని అర్చకులు వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ ఘనంగా నిర్వహించారు. ఈమేరకు ఆలయంలో అర్చకులు స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయ మండపంలో వుంచి సత్యనారాయణవ్రతంను నిర్వహించారు. సత్యనారాయణస్వామి వ్రత మహత్యాన్ని అర్చకులు భక్తులకు వివరించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. శ్రీశ్రీదేవి భూదేవి సమేత వరదరాజస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా శనివారం రాత్రి పున్నమి గరుడసేవను అత్యంత ఘనంగా నిర్వహించారు. అలంకరించిన సాఉత్సవమూర్తులను గరుడవాహనంపై వుంచి మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## పాదపద్మపీఠం బహూకరణ



శ్రీకాళహస్తిరూరల్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలం తొండమనాడులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి నెల్లూరుకు చెందిన దాతలు పాదపద్మపీఠాన్ని బహూకరించారు. బంగారు మలాంతో చేయించిన సుమారు రూ.70వేల విలువ కల్గిన అష్టదళ పాద పద్మ పూజా పీఠాన్ని అందించారు. నెల్లూరుకు చెందిన ఇవియస్ గురుప్రసాద్, సుధాకర్ అనే భక్తులు చాలా కాలంగా తొండమాన్‌పురంలోని ఆలయానికి భక్తులు వస్తున్నారు. ఇక్కడ అవసరాలను గుర్తించిన వారు స్వామి అమ్మవార్లకు చక్కటి పాదపద్మపీఠాన్ని తయారు చేయించి బహూకరించారు. ఈ కార్యక్రమంలో డెప్యూటి ఇఓ నాగరత్న, సూపరింటెండెంట్ జ్ఞాన ప్రకాశం, సీనియర్ అసిస్టెంట్ అనిల్ కుమార్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ సుదీర్, డెప్యూటి ఇఓ జీవిత తదితరులు పాల్గొన్నారు.

## వేడుకగా రెండవసారి గరుడసేవ

-భక్తులను కటాక్షించిన మలయప్ప



తిరుమల, సెప్టెంబర్ 26 ప్రభాతవార్తప్రతినిధి: భాద్రపదమాస పౌర్ణమివేళ ఏడుకొండల వేంకటేశ్వరస్వామి అత్యంత కమనీయమైన, ప్రాధాన్యతవున్న గరుడవాహనంపై అభయమిచ్చారు. పౌర్ణమి సందర్భంగా శనివారం రాత్రి 7గంటలకు ఈ గరుడ వాహనసేవ మొదలైంది. ఈనెలలో రెండవసారి మళ్ళీ గరుడసేవ జరగడం విశేషం. భక్తుల గోవిందనామ్మరణల మధ్య మలయప్ప స్వామి భక్తకోటిని కరుణించడానికి ఆలయమాఢవీధుల్లో ఊరేగాడు. ఈ వాహనసేవలో టిటిడి అదనపు ఈఓ వెంకయ్య చౌదరి, ఆలయ పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదార్ హిమత్‌గిరి, అర్చకులు పాల్గొన్నారు.

**తిరుమల గోశాలలోనే**

## స్వామి కైంకర్యాలకు అవసరమైన పాలు ఉత్పత్తి

-వంతారా ప్రతినిధులతో టిటిడి అదనపు ఈఓ వెంకయ్య చౌదరి



తిరుమల, సెప్టెంబర్ 26ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామి కైంకర్యాలకు అవసరమైన పాల ఉత్పత్తులలను సాధ్యమైనంత వరకు తిరుమలలోనే ఉత్పత్తి చేసేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని టిటిడి అదనపు ఈఓ సిహెచ్ వెంకయ్యచౌదరి సూచించారు. గో సంరక్షణకు మరింత ప్రాధాన్యతనిస్తూ గోశాలలను సమగ్రంగా అభివృద్ధి చేయాలని ఆయన పేర్కొన్నారు. గోశాలల్లో జంతు సంక్షేమం, పరిశుభ్రత, భద్రత, సౌకర్యాల పరంగా అన్ని విధాలుగా చర్యలు తీసుకోవాలన్నారు. శనివారం తిరుమలలో పద్మావతి అతిథి గృహంలోని సుధర్మ సమావేశ మందిరంలో టిటిడి గోశాలలను ఉచితంగా అభివృద్ధి చేసేందుకు స్వచ్ఛందంగా విచ్చేసిన రిలయన్స్ సంస్థకు చెందిన వంతారా సంస్థ ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టిటిడి జెఈఓ ప్రభల గోపీనాథ్, ఎస్వీ గోశాల డైరెక్టర్ శివ కుమార్, ఎస్ఇ వేణు గోపాల్, ఇఇ శ్రీనివాసరావు, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పవిత్రోత్సవాలు ముగింపు ఉత్సవం



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో పవిత్రోత్సవాలు శనివారంతో ఐదు రోజుల పాటు నిర్వహించిన పవిత్రోత్సవాలు ముగిసాయి. ఉత్సవాలకు సంబంధించి ఇఓ మాట్లాడుతూ శివయ్య సేవలో పాల్గొనే అవకాశం తమకు శివయ్య కల్పించాడన్నారు. ఇక



పవిత్రోత్సవాలు ప్రారంభించినప్పటి నుంచి అప్పటి వరకు వేసవిని మరిపిస్తూ ఎండలు జనాలను భయభ్రాంతుల్ని చేస్తుండగా ఉత్సవాలు ప్రారంభమైనప్పటి నుంచి జన జీవనానికి ఇబ్బంది లేకుండా రాత్రి వేళల్లో వర్షం కురిసి చల్లదనాన్ని ప్రకృతి అందించిందన్నారు. పవిత్రాలను దేవతా మూర్తులనే కాకుండా గోపురం వెలుపలి మరియు పైభాగాన ఆకాశ వినాయక స్వామి, స్వామి అమ్మవార్ల గోపురాల శిఖరాలకు కూడా పవిత్రాలను సమర్పించామన్నారు. పవిత్రోత్సవాలకు సహకరించిన ప్రతి ఒక్కరికి దేవుని ఆశీస్సులు ఉండాలని పూజలు జరిపామన్నారు. పవిత్రోత్సవాల్లో స్థానిక శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టె సాయిప్రసాద్, సభ్యులు పాల్గొన్నారన్నారు. ప్రతి రోజూ సభ్యులు గుర్రప్పశెట్టి పాల్గొన్నారన్నారు. చివరి రోజు కార్యక్రమాల్లో ఇఓ బికె వెంకటేశులు, బోర్డు సభ్యులు వాకచర్ల గుర్రప్పశెట్టి, బిజెపికి చెందిన వెంకట రామానాయుడు, చాగణం శైలజ, నాగరాజు, ఇఇ శ్రీనివాసులు రాజు, డిఇఇ శ్రీనివాసులురెడ్డి, ఎఇఓలు లోకేష్‌బాబు, విద్యాసాగర్‌రెడ్డి, హేమామాలిని టెంపుల్ సూపరిం టెండెంట్ నాగభూషణం యాదవ్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ హరియాదవ్, వెంకటస్వామి, అర్చకులు డాక్టర్ స్వామినాథన్ గురుకుల్, సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్, వరదా గురుకుల్, పౌరోహితులు అర్ధగిరి స్వామి, రాజేష్ గురుకుల్, నిరంజన్ గురుకుల్, సూరి గురుకుల్ అచ్చితా గురుకుల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలోచనల నుంచి ఆవిష్కరణల దిశగా విద్యార్థులు

-సమస్యను గుర్తించి పరిష్కారం చూపేలా డిజైన్ థింకింగ్‌పై శిక్షణ



తిరుపతి విద్య, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : తరగతి గదిలో నేర్చుకున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సమాజంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారంగా మలచుకునే దిశగా ఇంజనీరింగ్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. శ్రీరామ ఇంజనీరింగ్ కాలేజీలో డిజైన్ థింకింగ్, క్రిటికల్ థింకింగ్, ఆవిష్కరణలు, ఇంక్యుబేషన్ అవకాశాలపై ఐఐసీ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఐఈఈఈ ఎస్ఆర్ఈటీ విద్యార్థి విభాగం సహకారంతో శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. బెంగళూరుకు చెందిన సాఫ్ట్ స్కిల్స్, ఆవిష్కరణలు, వ్యాపార శిక్షకుడు బి.ఎస్. లోకేష్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఒక సమస్యను గుర్తించడం దగ్గర నుంచి దాని వెనుక ఉన్న అవసరాన్ని అర్థం చేసుకోవడం, వివిధ పరిష్కారాలను ఆలోచించడం, వాటిలో ఉపయోగకరమైనదాన్ని ఎంపిక చేసి ప్రాజెక్టుగా అభివృద్ధి చేయడం వరకు డిజైన్ థింకింగ్ విధానాన్ని వివరించారు. ఆలోచనకు సాంకేతికతను జోడించి ఆవిష్కరణగా మలచడం, ప్రాజెక్టును స్టార్టప్‌గా అభివృద్ధి చేసుకోవడం, ఇందుకు ఇంక్యుబేషన్ కేంద్రాల నుంచి పొందగల సహకారంపై అవగాహన కల్పించారు. కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగ అవకాశాల కోసం సిద్ధమవడంతో పాటు సమస్యలకు పరిష్కారాలు చూపే స్థాయిలో ఆలోచనలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యం, వ్యాపార దృక్పథం పెంపొందితే విద్యార్థులు తమ ఆలోచనలను ఆచరణలోకి తీసుకురాగల రన్నారు. కొత్త ఆలోచనలకు ప్రోత్సాహం అందించేలా కళాశాలలో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవింద్‌కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వాసు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కర్నాటక ఇండియన్ రైల్వేటీం పూల్-ఎ విజేత



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: విద్యా ప్రకాశనంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో జరుగుతున్న 72వ సీనియర్ బాల, బాలికల జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో శని వారం రాత్రి అందిన సమాచారం మేరకు కర్నాటక ఇండియన్ రైల్వేటీమ్ ఏఐఇఎస్‌సిబి మహారాష్ట్రపై గెలుపొంది పూల్-ఎ విజేతగా నిలిచారు. కర్నాటక రాష్ట్రం ఏఐఇఎస్‌సిబి మహారాష్ట్రలపై గెలుపొంది పూల్-ఎలో రెండ స్థానం నిలిచింది. ఆంధ్రప్రదేశ్ పురుషులు పూల్-బి పోటీల్లో తమిళనాడు, కేరళ, తెలంగాణాలపై గెలుపొంది విజేతగా నిలిచినట్లు రెండవ స్థానం సాధించినట్లు నిర్వాహకులు ప్రకటించారు. తమిళనాడు మహిళలు పూల్-ఎ విభాగంలో కేరళ, తెలంగాణా, ఛండీష్‌ఘడ్‌లపై విజయం సాధించి విజేతగా నిలిచారు. తెలంగాణా రాష్ట్రం కేరళ, ఛతీష్‌ఘడ్‌లపై గెలిచి ద్వితతీయ స్థానంలో నిలిచింది. మహిళలు పూల్-బి పోటీల్లో కర్నాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్ టీమ్‌లఎపై గెలిచి విజేతగా నిలిచింది. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్ టీమ్‌లపై గెలిచి ద్వితీయ స్థానం సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు.

**ఫ్లడ్‌లైట్ల వెలుగులో:**

ఇక్కడ జరుగుతున్న బాల్‌బ్యాడ్మింటన్ జాతీయ సీనియర్ బాల, బాలికల విభాగం పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. క్రీడాకారులు పోటీలు పడి తమ సత్తాచాటుతూ గెలుపుదిశగా పరుగు తీస్తున్నారు. శుక్రవారం గాలి, వానతో ఇబ్బంది ఏర్పడింది. అయితే సకాలంలో పోటీలు నిర్వహణ పూర్తి చేయుటకు శనివారం రాత్రి మైదానంలో ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను రాష్ట్ర కార్యదర్శి బాలాజీ, శ్రీకాళహస్తి అధ్యక్షులు సి.హెచ్ వెంకటస్వామి పర్యవేక్షిస్తున్నారు.

## భక్తి పారవశ్యంలో నగర సంకీర్తన



తిరుపతి, సెప్టెంబర్ 26ప్రభాతవార్త: తిరుపతి నగరంలో పెరటాసి మాసం 2వ శనివారం భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. ( మహావిష్ణువుకు, వేంకటేశ్వర స్వామికి అత్యంత ప్రీతికరమైన పెరటాసి మాసం ప్రారంభం కావడంతో నగర సంకీర్తనకు ప్రత్యేక శోభ సంతరించుకుంది. ఉదయం ఐదు గంటలకు మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, శ్రీహరి నామస్మరణల నడుమ నగర సంకీర్తన ప్రారంభమైంది. గోవింద... నామస్మరణతో తిరుపతి వీధులన్నీ మారుమోగాయి. చంద్రమౌళి, మునినాథరెడ్డి, రిటైర్డ్ టీచర్ విజయ్ భాస్కర్ రెడ్డి, కత్తుల కిషోర్ రాయల్, తొండమనాటి దశరథ రెడ్డి, కృష్ణంరాజు, గుండాల గోపీనాథ్‌రెడ్డి, రవిశంకర్ యాదవ్, పురుషోత్తం యాదవ్, మురళి, మేకల గంగయ్య, కొండేపంగారెడ్డి, పొన్నాల జెజిరెడ్డి, రాజేంద్రన్, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, వాసుదేవరెడ్డి, అరుణమ్మ, జయమ్మ, విజయకుమారి, శ్రావణి, అమరావతి, పావని, ఉష్శ్రీ, రేవతి, ఉమాజీ, పద్మ, వై.పద్మావతి, సిద్ధమ్మ, ధనమ్మ, కల్పన, నాగరాజమ్మ, పద్మావతి, కళ్యాణి, సుశీలమ్మతో మండలి సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## శ్రీ వెంకటేశ్వరునికి చందనాలంకారం



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త: సూళ్లూరుపేట లోని శ్రీమద్ వెంకట రామమూర్తి దేవస్థానంలో పెరటాసి నెల రెండవ శనివారాన్ని పురస్కరించుకొని శ్రీ వెంకటేశ్వర స్వామికి చందనాలంకారం చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వేకువ జాము నుంచే చందనాలంకార శోభితుడైన స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో దేవస్థానానికి చేరుకున్నారు. దర్శనానంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. దేవస్థాన అర్చకులు వినుకొండ అనంత కుమార్ దీక్షితులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

## సూళ్లూరుపేటలో భాద్రపద పౌర్ణమి వేడుకలు



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలో భాద్రపద పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని శ్రీ నాగేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం శ్రీ నాగేశ్వరస్వామి వారికి రుద్రాభిషేకం, సామూహిక హారతి, శ్రీలలితా పారాయణం, సాయంత్రం సామూహిక హారతి, భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. దేవస్థాన చైర్మన్ తాటిపర్తి ఆదినారాయణ రెడ్డి, అర్చకులు పేటేటి సునీల్ కుమార్ శర్మ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి. అలాగే శ్రీ అభయ శంకర దేవస్థానంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్ పర్యవేక్షణలో అర్చకులు రమణయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

## ఘనంగా వేనాటి జన్మదిన వేడుకలు




సూళ్లూరుపేట, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: తిరుపతి పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి జన్మదిన వేడుకలను తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద శనివారం రాత్రి ఆయన అభిమానులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేకును కట్ చేసి జన్మదిన సంబరాలను జరుపుకు న్నారు. నియోజకవర్గంలోని తెలుగు దేశం పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున హాజరై వేనాటి సతీష్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వేనాటి సతీష్‌రెడ్డి మాట్లాడుతూ తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యలు తీర్చడంలో ముందుంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు చిట్టేటి పెరుమాళ్, ఎస్ ఎన్ మునిరాజ, బుద్ధి విజయలక్ష్మి, పర్వతరెడ్డి చంద్రారెడ్డి, వేనాటి జనార్ధన్ రెడ్డి, కామిరెడ్డి మురళిరెడ్డి, సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి, జక్కల బాలయ్య, సతీష్ చంద్ర, పిన్నబోయిన సుబ్బయ్య, బట్ట సుబ్రహ్మణ్యం పలువురు నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చెరువులో పడి యువకుడి దుర్మరణం!

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : మండల పరిధిలోని దావదగుంట గ్రామంలోని చెరువులో పడిరాజేష్ (38)అనే యువకుడు మృతి చెందాడు. శనివారం ఈ మృతదేహాన్ని చూసిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు రాజేష్ నాయుడుపేట బేరిపేటకు చెందిన వ్యక్తిగా పోలీసులు తెలిపారు. గత పది రోజుల క్రితం భార్యతో గొడవపడి నాయుడుపేట నుండి వచ్చేసాడని సమాచారం. పోలీసులు కేసు నమోదు చేస్తే దర్యాప్తు చేస్తున్నారు.

## జాతరలో అల్లర్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు : ఎస్పీ



బాలాయపల్లి, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: పోలేరమ్మ జాతరలో అల్లర్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు హెచ్చరించారు. ఈనెల 30, అక్టోబర్ నెల ఒకటో తేదీలలో వెంకటగిరిలో జరగబోవు పోలేరమ్మ జాతర ఏర్పాట్లను ఎస్పీ, ఏఎస్పీలు, డిఎస్పీలు పరిశీలించారు. పోలేరమ్మ జాతరలో సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల ద్వారా పరివేక్షణ ఉంటుందని చెప్పారు. జాతరలో అల్లర్లకు పాల్పడే వారిని గుర్తించి జాతర అయిన తర్వాత కేసులు పెట్టే అరెస్ట్ చేస్తామని చెప్పారు. జాతరలో పిగిలిలు ఊది ఇబ్బంది పెట్టే వారిపై కూడా చర్యలు తీసుకుంటా మన్నారు. జాతర అయ్యేవరకు పిగిలీల విక్రయాలను కూడా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ప్రశాంత వాతావరణంలో జాతరను అందరూ జరుపుకోవాలని కోరారు. మద్యం, గంజాయి వంటివి సేవించి అదుపుతప్పి ప్రవర్తించరాదని సూచించారు. పోలేరమ్మ గుడి, అమ్మవారిని తయారు చేసే చాకలి వీధి, అమ్మవారి అలంకరణ మండపం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. పోలేరమ్మ ఊరేగింపు ప్రదేశాన్ని మొత్తం నడిచి ఎస్పీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు మనోహర్ ఆచారి, శ్రీనివాసులు, డిఎస్పిల గీతా కుమారి, చెంచు బాబు, సిఐ రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు పోలేరమ్మ జాతర ఘటోత్సవం

– ఈవో శ్రీనివాసులు రెడ్డి



బాలాయపల్లి, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: పోలేరమ్మ జాతరలో భాగమైన ఘటోత్సవం ఆదివారం జరుగుతుందని ఆలయం ఈవో ఆరో భూమి వెంకట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. కాంపౌండ్ నుండి ఘటోత్సవం కుండలను పట్టణ పురవీధుల్లో భక్తుల దర్శనం కోసం ఉపయోగిస్తారని తెలిపారు. 30, అక్టోబర్ ఒకటో తేదీ జాతర జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంగ్లీ తదితరులచే పాటకచేరి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పర్యవేక్షణలో జాతర ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

## ప్రజలకు టిబి నిర్ధారణ పరీక్షలు



చిట్టమూరు, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: ఎంవి రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిట్టమూరు మండలం గుణపాడు గ్రామ ప్రజలకు శనివారం టిబి ముందస్తు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కోట మండలం చెందోడు గ్రామానికి చెందిన విద్యా ప్రదాత స్వర్గీయ ముప్పవరపు వెంకటేశ్వరరావు వారి ఆదిలక్ష్మి జ్ఞాపకార్థం ఎంవి రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుణపాడు గ్రామంలో ముక్తభారత్ కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలందరికీ హ్యాండిల్ ఎక్స్‌రే ద్వారా టిబి వ్యాధిని నిర్ధారించే నిమిత్తం చెస్ట్ ఎక్స్‌రే పరీక్షలను నిర్వహించి టిబి వ్యాధిగ్రస్తులను గుర్తించారు. అనంతరం బీపీ పరీక్షలు చేపట్టారు. టిబి నిర్ధారణ అయిన వారికి గళ్ళ పరీక్షలు చేసి వ్యాధి పూర్తిగా నిర్ధారణ అయితే వారికి ఆరు నెలల కోర్సుకు సంబంధించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. టీబీ వ్యాధి నిర్ధారణమైన రోగులకు పౌష్టికాహారాన్ని ఎంవి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంవి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ, కార్యదర్శి ఎం విజయలక్ష్మి, టిబి సూపర్వైజర్ గోవర్ధన్, ఫీల్డ్ కోఆర్డినేటర్ ఏడుకొండలు, ఎం ఎల్ హెచ్ పి హరిత హెల్త్ సూపర్వైజర్ రవి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ఆటో దోపిడీ ముఠాకు పోలీసుల చెక్



రేణిగుంట, సెప్టెంబరు 26 ప్రభాతవార్త: ఒంటరిగా ఆటోలో ప్రయాణిస్తున్న వ్యక్తిని అడ్డగించి దాడి చేసి నగదు, సెల్‌ఫోన్ దోపిడీ చేసిన కేసులో గాజులమండ్యం పోలీసులు ముగ్గురు నిందితులను చాకచక్యంగా అరెస్ట్ చేశారు. దామినేడు క్రాస్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకుని రెండు ఆటోలు, దోపిడీ చేసిన వివో సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ వై. శ్రీనివాసరావు పర్యవేక్షణలో రూరల్ సీఐ ఎం. మంజునాథరెడ్డి ఆధ్వర్యంలో గాజులమండ్యం ఎస్ఐ హరీష్, సిబ్బంది దర్యాప్తు చేపట్టారు. ఈ నెల 24న తూకివాకం చెరువు సమీపంలో బాధితుడిని చీకటి ప్రాంతానికి తీసుకెళ్లి దాడి చేసి రూ.500 నగదు, సుమారు రూ.10 వేల విలువైన సెల్‌ఫోన్‌ను లాక్కున్నట్లు పోలీసులు తెలిపారు.అరెస్టయిన వారిలో ఎస్. జయకుమార్ అలియాస్ స్వామి (43), జరుపాల్ హన్మంతు (తెలుగు రవి) (27), సుంకర మోహిత్ సాయి (21) ఉన్నారు. వీరిపై గాజులమండ్యం పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 135/2026 కింద కేసు నమోదు చేశారు. అరెస్టయిన వారిపై గతంలోనూ పలు దొంగతనం, ఇతర నేరాలకు సంబంధించిన కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. రాత్రి వేళల్లో ఒంటరిగా ప్రయాణించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

## శ్రీకాళహస్తి పరిధిలో 10 మద్యం దుకాణాలకు టెండర్లు

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పరిధిలో ఖాళీగా ఉన్న మద్యం దుకాణాల కేటాయింపునకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు శ్రీకాళహస్తి ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ లావణ్య శనివారం ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. ఆమె మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలో మొత్తం 10 దుకాణాలకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఆమె తెలిపారు. అందులో శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలో 3 దుకాణాలు, ఏర్పేడు మండల పరిధిలో 3 దుకాణాలు, తొట్టంబేడు మండల పరిధిలో 3 దుకాణాలు, బి.ఎన్.కండ్రిగ మండల పరిధిలో 1 దుకాణాన్ని కేటాయించినట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం శ్రీకాళహస్తి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ను సంప్రదించాలని ఆమె కోరారు.

## పోటీ పరీక్షల అభ్యర్థులకు దాతల చేయూత

ఏర్పేడు సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:



ఏర్పేడు శాఖా గ్రంథాలయానికి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఉపయోగపడే విలువైన పుస్తకాలు విరాళంగా అందాయి. నిరుద్యోగ యువతకు, గ్రంథాలయానికి అండగా నిలిచేలా ఇద్దరు దాతలు ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందించారు.రాజేష్ అనే దాత సుమారు ఐదువేల రూపాయల విలువైన ఏపీపీఎస్సీ గ్రూప్1, గ్రూప్2 పోటీ పరీక్షలకు సంబంధించిన ప్రామాణిక పుస్తకాలను గ్రంథాలయానికి విరాళంగా అందజేశారు. అదేవిధంగా సుధాకర్ అనే మరో దాత తెలుగు అకాడమీకి సంబంధించిన పుస్తకాలను గ్రంథాలయానికి అందించారు. ఈ సందర్భంగా స్థానిక గ్రంథాలయాధికారి బిలాల్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు, ఉద్యోగార్థులు మరియు ఇతర పాఠకులకు ఈ పుస్తకాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. గ్రంథాలయ అభివృద్ధికి, పాఠకుల ప్రయోజనానికి ఉపయోగపడే పుస్తకాలను విరాళంగా అందించిన రాజేష్, సుధాకర్ లకు గ్రంథాలయాధికారి బిలాల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## వీఆర్ఏలకు న్యాయం చేయండి

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:



రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ రెవెన్యూ అసిస్టెంట్లకు పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గత వారం రోజులుగా వీఆర్ఏలు చేపడుతున్న నిరవధిక నిరాహార దీక్షకు మద్దతుగా శ్రీకాళహస్తిలో సీఐటీయూ సంఘీభావం ప్రకటించింది. శనివారం శ్రీకాళహస్తి మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వీఆర్ఏల శిబిరాన్ని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, నాయకులు గంధం మణి సందర్శించి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏలు బాల గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

## కందాడు వాసుల చిరకాలకోరిక తీర్చిన టిడిపి

ఏర్పేడు, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:



ఏర్పేడు మండలం కందాడు గ్రామంలో ఏళ్ళ తరబడి వేధిస్తున్న రోడ్డు సమస్య టిడిపి నాయకత్వం పరిష్కారం చూపింది. గ్రామంలో బృందావనం నుంచిపుట్టాలమ్మ ఆలయం వరకు,వ్యవసాయ పొలాలకు వెళ్ళే ప్రధాన రహదారి నిర్మాణ పనులకు శనివారం భూమి పూజ నిర్వహించారు. మండల టిడిపి పార్టీ అధ్యక్షులు పేరం నాగరాజ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయం వద్ద కొబ్బరి కాయ కొట్టి పనులను ప్రారంభించారు. గ్రామస్థులని రైతులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఈరోడ్డుకు మోక్షం కలిగిందన్నారు. ఈ మేరకు వానాకాలం పొలాలకు వెళ్ళడానికి అలాగే భక్తులు అమ్మవారి ఆలయం వెళ్ళ డానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేరం నాగరాజునాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ కేశినేని సుబ్రమణ్యం,టిడిపి నాయకులు తేజ, మనోజ్, మునీశ్వర్, జయప్రకాష్‌నారాయణ, రాజగోపాల్, బాలాజి, నరేంద్ర, త్యాగ, బొజ్జయ్య, మణి,రంగయ్య,ఉమాశంకర్, మనోహర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## దిగువ సాంబయ్యపాలెంలో మంచినీటికి కట కట



**తొట్టంబేడు, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** తొట్టంబేడు మండలం దిగువ సాంబయ్యపాలెం గ్రామంలో వేసవి ఎండలతో మంచినీటికి కట కట ఏర్పడింది. ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రైవేటు వ్యక్తులకు వరంగా మారింది. పేదలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతి ఆర్ఓ వాటర్ ప్లాంట్ తుప్పుపట్టింది. ఫలితంగా గ్రామంలో మంచినీటి కోసం ప్రజలు తిప్పలు పడుతూ ప్రైవేటు వ్యక్తులపై ఆధారపడాల్సి న దుస్థితి నెలకొంది. ఒకప్పుడు ఈ ప్లాంట్ ద్వారా గ్రామంలోని ప్రతి కుటుంబానికి కేవలం 2 రూపాయలకే 20 లీటర్ల స్వచ్ఛమైన నీరు అందించే వారు. పేద, మధ్యతరగతి ప్రజలకు అనుకూలంగా ఉండేది. కాలక్రమేణా ప్లాంట్ నిర్వహణను అధికారులు పట్టించుకోదని ప్రజలు వాపోయారు.ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి దిగువ సాంబయ్యపాలెం సుజల ప్లాంట్ ను తక్షణమే బాగు చేయించి, పేదలకు తక్కువ ధరకే మంచినీటిని అందించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

## సెటిల్‌మెంట్ భూమి ఆక్రమణ



బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: సెటిల్మెంట్ భూమిలో నిర్మించుకున్న ఇంటి స్థలం ఆక్రమణదారుల నుంచి కాపాడి రక్షించాలని బాధితుడు తహశీల్దార్‌కు విన్నవించారు. కొందరు తమపై నిష్కారణంగా దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని అరి కట్టి న్యాయం చేయాలని బాధితులు అభ్యర్థిం చారు. కోర్టులో కేసు నడుస్తున్న స్థలంలో ఆక్రమంగా నిర్మాణాలు చేపట్టండం చట్టం ఉల్లంఘన కాదా అని బాదితులు వేమనబోయిన మునిరాఘవమ్మ పేర్కొన్నారు.శనివారం కుక్కంభాకం గ్రామానికి చెందిన మునిరాఘవమ్మ ఇంటి స్థలంఆక్రమణపై స్థానిక తహశీల్దార్ కార్యాలయం నందు ఆర్ఐ మించల నల్లయ్యకు వినతి పత్రంఅందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుక్కంభాకం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 147/6 బిలో 0.37 సెంట్లు భూమి హక్కులతో తమ అధీనంలో ఉందని ఆ భూమి పై కన్నేసిన వంక రవి,వంక రమణయ్య,కె.వేణు మరికొందరు దౌర్జన్యంతో పిత్రాజితమైన సెటిల్ మెంటు స్థలమును దౌర్జన్యముగా ఆక్రమించుకుని దాడులకు పాల్ప డుతున్నారని అమె పేర్కొన్నారు.ఆక్రమ నిర్మాణాలను అరికట్టి చట్టపరమైన చర్యలు చేపట్టాలని తమకు న్యాయం చేయాలని ఆమె కోరారు.

## పిల్లల సమగ్ర అభివృద్ధిలో అంగన్‌వాడీల పాత్ర కీలకం



విజయపురం, సెప్టెంబరు 26 ప్రభాతవార్త: పిల్లల సమగ్ర అభివృద్ధిలో అంగన్‌వాడీల పాత్ర కీలకమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి పేర్కొన్నారు. మండల పరిధిలోని జగన్నాథపురం, కృష్ణ సముద్రం, జగన్నాథపురం ఎస్టీ కాలనీ, ఇష్టకామేశ్వరాపురం, గొల్లకండ్రిగ హరిజనవాడ అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం అంగన్‌వాడీ ఉత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ లక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉత్సవం ద్వారా చిన్నారుల్లో సృజనాత్మకత, సామాజిక నైపుణ్యాలు, ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించేందుకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. జగన్నాథపురం అంగన్‌వాడీ కార్యకర్త పనితీరు బాగుందని గ్రామంలోని పెద్దలు శాలువతో సన్మానించారు. అంగన్‌వాడీకార్యకర్తలు చాముండేశ్వరి, అముద, తేజోవతి, సరిత, రోజా పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన పవిత్రోత్సవాలు



నారాయణవనం సెప్టెంబరు 26 ప్రభాతవార్త: మండల కేంద్రంలోని నారాయణ వనంలో ప్రసిద్ధి చెందిన ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ పద్మావతి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వరుని ఆలయంలో గత రెండు రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో ఘనంగా పవిత్రోత్స వాలు వలన నిర్వహిస్తున్నారుపవిత్ర ఉత్స వాల్లో భాగంగా శనివారం రెండవ రోజు ఉదయం ఆలయంలో శుద్ధి పుణ్యవచనం సుప్రభాత సేవలతో స్వామివారిని మేలుకొలిపిన తర్వాత అభిషేకం పుష్పాలంకరణ నిర్వహించారు. అనంతరం ఉదయం 9 గంటలకు వేద పండితుల ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర ని తిర్చిపై అలంకరించి ఊరేగించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నాగరత్న, సూపరింటెండెంట్ ధర్మయ్య ఆలయ పర్యవేక్షకులు వెంకట శివ కుమార్ షరాబు భరత్ శ్రీవారి అర్చకులు శ్రీధర్ బఠాచార్య నరసింహ రాఘవ భటాచార్య శ్రీనివాస భట్టాచార్యులు సిబ్బంది పాల్గొన్నారు

## అంగన్వాడీలో వివిధ పథకాలపై అవగాహన




నారాయణవనం సెప్టెంబరు 26 ప్రభాతవార్త: పిచ్చాటూరు ప్రాజెక్టు పరిధిలోని నారాయణవనం మండలంలో నారాయణవనం అంగన్వాడీ కేంద్రం నందు అంగన్వాడి పోషణ మా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా నరేంద్రమోడీ సుదీర్ఘ 25 సంవత్సరాల ప్రజాసేవ ప్రయాణాన్ని స్మరించుకుంటూ మహిళలు మరియు శిశువుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలపై అవగాహన కల్పించారు ముఖ్యంగా ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన అంగన్వాడి సేవలు పోషణమా కార్యక్రమ ద్వారా గర్భిణీలు బాలింతలు చిన్నారులకు పోషకాహారం ఆరోగ్యం పరిశుభ్రత , సమతుల్య ఆహారం ప్రాముఖ్యతపై తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ బేబీ ప్రియాంక అంగన్వాడి టీచర్ నరసమ్మ ఆశ గర్భవతులు బాలింతలు తల్లులు పాల్గొన్నారు

## ఘనంగా అంగనవాడి ఉత్సవాలు




తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : తిరుపతి అర్బన్ రాస్ ప్రాజెక్ట్ సెప్టెంబర్ నెల 26వ తారీకు సత్యనారాయణపురం అంగన్వాడి కేంద్రంలో సేవా సంకల్ప అభియాన్ లో భాగంగా శనివారం అంగన్వాడి ఉత్స వాలు ఘనంగా నిర్వహించారు అంగన్వాడీ ఇ.గోమతికి 25 సంవత్సరాలు విధి నిర్వహణ పూర్తయినది. సత్యనారాయణపురంలోని మదర్స్ అందరూ ఘనంగా సన్మానం చేయడం జరిగింది. చిన్నారుల పోషణ విషయంపై చర్చ నిర్వహించారు ముఖ్య అతిథులు మెడికల్ డిపార్ట్మెంట్ శ్రీహరి సూపర్వైజర్ శ్రీదేవి ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది. గర్భవతులు, బాలింతలు, ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాల పిల్లల పేరెంట్స్, ప్రీస్కూల్ పిల్లల పేరెంట్స్ లబ్ధిదారుల తండ్రులు తాతలు మామలు అత్తలు పిల్లలు. గర్భిణీలను పెద్దలందరూ ఆశీర్వదించి పోషకాహారం ఆరోగ్యం, అంగన్వాడిసేవల ప్రాముఖ్యతపై మాట్లాడారు. చిన్నారుల ఆరోగ్యం పోషణ ప్రాథమిక విద్య సమగ్ర అభివృద్ధిలో అంగన్వాడీలు కీలకంగా పనిచేస్తున్నాయని తెలిపారు. అంగన్వాడి టీచర్ల సేవలను అభినందించి, వారికి సన్మానం చేశారు.

## తిరుపతి రూరల్‌లో మద్యం షాపుల టెండర్లకు నోటిఫికేషన్



తిరుపతి రూరల్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : తిరుపతి రూరల్ పరిధిలోని మద్యం దుకాణాల టెండర్ల కోసం ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించుకోవచ్చని తిరుపతి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ ఈ నరసానాయుడు స్పష్టం చేశారు. దరఖాస్తుల సమర్పణకు 2026 అక్టోబర్ 1 సాయంత్రం 5 గంటల వరకు గడువు నిర్ణయించారు. ఇతర వివరాలకు 9440902543 సంప్రదించాలని కోరారు.

## పరమేశ్వరమంగళం సీఆర్సీని సందర్శించిన డీఈవో కుమార్



పుత్తూరురూరల్, సెప్టెంబరు 26 ప్రభాతవార్త: పుత్తూరు మండలంలోని పరమేశ్వరమంగళం సీఆర్సీని తిరుపతి జిల్లా డీఈవో కె.వి.ఎన్.కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పర్యవేక్షించి విద్యాభివృద్ధి గురించి పలు సూచనలు, విలువైన సూచనలు అందించారు. కార్యక్రమంలో ఎంఈవో తిరుమలరాజు, మండలంలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నకిలీ వీడియోలతో కక్షసాధింపు చర్యలు టీడీపీ



పుత్తూరురూరల్, సెప్టెంబరు 26 ప్రభాతవార్త: మాజీమంత్రి రోజా పవిత్రతను, ప్రతిష్టను దిగజార్చేలా ఏఐ మార్ఫింగ్ వీడియోలు సృష్టించిన బాధ్యులపై కఠిన చర్యలుతీసుకోవాలని నగరి నియోజకవర్గ వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవిత్రమైన తిరుమల శ్రీవారి దర్శనం అనంతరం బయటకు వచ్చిన మాజీమంత్రి రోజా ఒరిజినల్ వీడియోను అత్యంత నీచంగా ఏఐ టెక్నాలజీ ద్వారా మార్ఫింగ్ చేసి ఆవిడగుండు కొట్టించుకుని వచ్చినట్లు తప్పుడు వీడియోలను సృష్టించి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న టీడీపీ, ఐటీడీపీ మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని నగరి నియోజకవర్గ పరిధిలోని పుత్తూరు, నగరి, విజయపురం, నింద్ర, వడమాలపేట పోలీస్‌స్టేషన్లలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఏకకాలంలో ఘాటుగా ఫిర్యాదు పత్రాలను అందజేశారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న ప్రతి ఒక్కరిపై న్యాయపరంగా పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు.

## కిచెన్ గార్డెన్‌పై వీవో లీడర్లకు అవగాహన

**చిన్నగొట్టిగల్లు సెప్టెంబరు 26 ప్రభాతవార్త:** కిచెన్ గార్డెన్ (ఇంటి తోట) ఏర్పాటుపై వీవో లీడర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గిడ్డయ్య మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో అందు బాటులో ఉన్న స్థలాన్ని వినియోగించుకుని ఆకుకూరలు, కూరగాయలు, ఔషధ మొక్కలను సాగు చేసుకోవడం ద్వారా కుటుంబ అవసరాలను కొంతమేర తీర్చుకోవచ్చని కార్యక్రమంలో వివరించారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి సహజ పద్ధతుల్లో కూరగాయలను పండించడం వల్ల ఆరోగ్యంతో పాటు కుటుంబానికి ఆర్థిక ప్రయోజనం కూడా కలుగుతుందని సూచించారు. కిచెన్ గార్డెన్ ఏర్పాటుకు అవసరమైన విత్తనాలు, మొక్కల ఎంపిక, సేంద్రియ ఎరువుల తయారీ, నీటి వినియోగం తదితర అంశాలపై వీవో లీడర్లకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమం లో ఏపీఎం సీతారాం, వెలుగు సీసీ లు సిబ్బంది పాల్గొన్నారు

## ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం

-మహిళలు,బాలికల రక్షణపై ఎస్పీ సుబ్బరాయుడు ప్రత్యేక దృష్టి
-బాల్య వివాహాల నివారణ.. సైబర్ నేరాల కట్టడికి విస్తృత అవగాహన
-డయల్-112, శక్తి యాప్ వినియోగంపై ప్రజలకు అవగాహన



రేణిగుంట, సెప్టెంబరు 26 ప్రభాతవార్త:ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు చేపడుతున్న చర్యలు ప్రజలకు భద్రతపై మరింత భరోసా కల్పిస్తున్నాయి. మహిళలు, బాలికల రక్షణ, బాల్య వివాహాల నివారణ, సైబర్ నేరాల నియంత్రణతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీసు యంత్రాంగం నిరంతరం ప్రజల్లో అవగాహన కల్పిస్తోంది.ఎస్పీ ఆదేశాల మేరకు రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాలు, ఆర్టీసీ బస్టాండ్లు, బస్సు షెల్టర్లు, ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాల్లో పోలీసు అధికారులు, సిబ్బంది విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పోలీసులను కేవలం నేరం జరిగిన తర్వాత స్పందించే వ్యవస్థగా కాకుండా.. నేరం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు సూచించే ప్రజా రక్షణ వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడుతున్నాయి. శనివారం రేణిగుంట ఆర్టీసీ బస్టాండులో రక్షక్-8 సిబ్బంది ప్రయాణికులతో నేరుగా మాట్లాడి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రయాణ సమయంలో విలువైన వస్తువులు, నగదు, మొబైల్ ఫోన్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ప్రయాణికులు అప్రమత్తంగా వ్యవహరించాలని పోలీసులు సూచించారు. అదే విధంగా సైబర్ నేరగాళ్ల మోసాలకు గురికాకుండా అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకుల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. బ్యాంకు వివరాలు, ఏటీఎం పిన్, ఓటీపీ వంటి కీలక సమాచారాన్ని ఎవరికీ వెల్లడించకూడదని హెచ్చరించారు.మహిళలు, బాలికల భద్రతకు పోలీసులు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని అధికారులు తెలిపారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై తల్లిదండ్రులు, యువత, గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. నేరాలపై ముందస్తు అవగాహన కల్పించడం, అనుమానాస్పద కార్యకలాపాలపై అప్రమత్తం చేయడం వంటి కార్యక్రమాలను జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు పోలీసులు నిరంతరం కొనసాగిస్తున్నారు. ప్రజల సహకారంతోనే నేరరహిత, సురక్షి త సమాజాన్ని నిర్మించగలమని పోలీసులు పేర్కొన్నారు

## బైండ్ ఓవర్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు.

-రౌడీషీటర్‌కు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ



రేణిగుంట, సెప్టెంబరు 26 ప్రభాతవార్త: బైండ్ ఓవర్ నిబంధనలను ఉల్లంఘించిన రౌడీషీటర్‌కు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు ఆదేశాల మేరకు రేణిగుంట డీఎస్పీ వై. శ్రీనివాసరావు సూచనలతో అర్బన్ సీఐ ఎస్. జయచంద్ర ఆధ్వర్యంలో పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. రేణిగుంటకు చెందిన రెడ్డిపల్లి ఇబ్రహీం కలీల్( షేక్ ఇమామ్)పై గతంలో నాలుగు కేసులు ఉండటంతో రౌడీషీట్ తెరిచి, జూలై 20న బైండ్ ఓవర్ చేశారు. అయినప్పటికీ సెప్టెంబరు 15న బుగ్గవీధిలో మద్యం సేవించి వినాయక విగ్రహం వద్ద గొడవకు పాల్పడినట్లు తేలడంతో కేసు నమోదు చేశారు. శనివారం ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ శ్రావణ్ కుమార్ ఎదుట హాజరుపరచగా 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారు.రౌడీషీటర్లు బైండ్ ఓవర్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని రేణిగుంట అర్బన్ పోలీసులు హెచ్చరించారు. రేణిగుంటలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చేపడుతున్న నిఘా, ముందస్తు చర్యలకు రిమాండ్ నిదర్శనం అన్నారు

## పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

రేణిగుంట, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:



రేణిగుంట మండలం అమ్మవారిపట్టెడ గ్రామంలో మండల ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ చక్రపాణి ఆదేశాల మేరకు హెల్త్ సూపర్వైజర్ కామరాజు ఆధ్వర్యంలో పోషణ్ మా అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కామరాజు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలబాలికలకు పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పోషకాహార లోపాన్ని నివారించడంతో పాటు రక్తహీనతను తగ్గించడం, చిన్నారుల ఎదుగుదలకు అవసరమైన పోషకాలను అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

ఆర్జిటి 3. ఆరోగ్యం పై అవగాహన కల్పిస్తున్న కామరాజు

## అర్ధరాత్రి వెలసిన శిలాఫలకం...ఇదేనా ఆధునికరణ?



**సత్యవేడు, సెప్టెంబరు 26 ప్రభాతవార్త:** సత్యవేడు రాజకీయాల్లో ఇదో కొత్త తరహా కొసమెరుపు అధికారులస్పందనపై ఆసక్తిగా దాదాపు ఏడు దశాబ్దాల నాటి పాత పంచాయతీరాజ్ భవనం అప్పట్లో ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో నిర్మించినట్లు స్థానికులు చెబుతున్న ఆ భవనానికి తాజాగా అర్ధరాత్రివేళ కొత్త శిలాఫలకం వెలవడం సత్యవేడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఏళ్ళ తరబడి ఎలాంటి హడావుడి లేకుండా ఉన్న పాత భవనానికి ఆకస్మాత్తుగా ఆధునికరణ పేరుతో శిలాఫలకం ప్రత్యక్షం కావడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ముఖ్యంగా ఈ కార్యక్రమం రాత్రివేళలో జరగడం పలు సందేహాలకు తావిస్తోంది. ఇంతకీ ఆ శిలాఫలకం ఎవరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఏ నిదులతో భవనానికి ఆధునికరణ చేపట్టారు. పనులు ఎప్పుడు ప్రారంభమయ్యాయి,అధికారిక అనుమతులు ఉన్నాయా, అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. సత్యవేడు మండలంలో ఎంతో మంది జడ్పీటీసీలుగాపనిచేసి పదవీ కాలం పూర్తి చేసుకుని మాజీ జడ్పీటీసీలుగా మారారు. అయితే తాజాగా చోటు చేసుకున్న ఈ ఘటన మాత్రం రాజకీయ వర్గాల్లో బలే బలే. ఇదేం కొత్త రాజకీయం అనే చర్చకు దారి తీస్తోంది. ఈ వ్యవహారంపై సంబంధిత పంచాయతీరాజ్ అధికారులు, స్థానిక అధికారులు స్పష్టత ఇవ్వాల్సి న అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. శిలాఫలకం ఏర్పాటు వెనుక ఉన్న వాస్తవాలు ఏమిటో దానికి సంబంధించిన ప్రభుత్వ రికార్డులు ఏమి చెబుతున్నాయో అధికారులు వెల్లడిస్తే అన్ని అనుమానాలకు తెరపడే అవకాశం ఉంది. అర్ధరాత్రి శిలాఫలకం వెలసిన ఈ ఆధునికరణ కథపై అధికారుల సమాధానం ఏమిటో వేచి చూడాలి.

## రేషన్ ఎలక్ట్రానిక్ మిషన్ తనిఖీ

**సత్యవేడు, సెప్టెంబరు 26 ప్రభాతవార్త:**



తిరుపతిజిల్లా సత్యవేడు మండలంలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్నరేషన్ షాపులకు సంబంధించిన ఎలక్ట్రానిక్ బరువు తూచే యంత్రాలను జిల్లా తూనికలు కొలత ఇన్‌స్పెక్టర్ రమేష్‌కుమార్ రెడ్డి పరిశీలించారు. శనివారంస్థానిక రెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలో 51 రేషన్ షాపులకు గాను 41 రేషన్ షాపులకు సంబంధించిన రేషన్ డీలర్లు వినియోగిస్తున్న ఎలక్ట్రానిక్ బరువు తూచేయంత్రాలను పరిశీలించడంతో పాటు అవి సక్రమంగా పనిచేస్తున్నాయా, లేదా అన్నది చెక్ చేశారు. ఈ నేపథ్యంలో తూనికలు కొలతలజిల్లా ఇన్‌స్పెక్టర్ రమేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సాంకేతిక నిపుణులు గజేంద్రనాయుడు, గణేష్ పాత్రోయోగేష్, చెంచుబాబు తదితరుల బృందంరేషన్ డీలర్లకు సంబంధించిన ఎలక్ట్రానిక్ బరువు తూచేయంత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

## ప్రసన్న వెంకటేశ్వరుని సేవలో ఎమ్మెల్యే

**వడమాలపేట, సెప్టెంబరు 26 ప్రభాతవార్త:** అప్పలాయగుంట ప్రసన్న వెంకటేశ్వర స్వామిని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ శనివారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ అధికారి వేణుగోపాల్ సాదర స్వాగతం పలికిదర్శన ఏర్పాట్లు చేశారు. వేద పండితుల తీర్థ ప్రసాదాలు అందజేశారు. అదే గ్రామంలోనూతనంగా నిర్మిస్తున్న లక్ష్మీ నరసింహ స్వామి ఆలయా న్ని సందర్శించి పూజలుచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధనంజయలునాయుడు, మురళీధర్‌రెడ్డి, దాముయాదవ్, శివరాయల్, వివేకానంద, లలిత, దేవా, తదితరులు పాల్గొన్నారు.



# తిరుపతి డివిజన్

## దసరా సెలవుల్లో లా పరీక్షలేంటి?

**అక్టోబర్ 12-21 సెలవుల్లో పరీక్షలు లేకుండా చూడాలని వీసీకి విజ్ఞప్తి**



తిరుపతి విద్య, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: దసరా సెలవుల్లో లా సెమిస్టర్ పరీక్షల నిర్వహణ విద్యారులకు ఇబ్బందికరంగా మారకుండా పరీక్షల షెడ్యూల్‌ను పునఃపరిశీలించాలని విజయ్ ఉత్తరాది కోరారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ న్యాయ కళాశాలల్లో 2వ, 4వ, 6వ, 8వ సెమిస్టర్ పరీక్షలను అక్టోబర్ 12 నుంచి 21 వరకు ఉన్న దసరా సెలవుల అనంతరం నిర్వహించేలా కొత్త షెడ్యూల్ ప్రకటించాలని వైస్ ఛాన్సలర్‌కు విజ్ఞప్తి చేశారు. సెలవుల మధ్యలో పరీక్షలు నిర్వహిస్తే విద్యార్థులకు ప్రయాణం, కుటుంబ కార్యక్రమాల పరంగా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. అందువల్ల సెలవులు ముగిసిన తర్వాత పరీక్షలు నిర్వహించేలా షెడ్యూల్‌ను మార్చాలని కోరారు. విద్యార్థుల విద్యా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజయ్ ఉత్తరాది విజ్ఞప్తి చేశారు.

## చిన్నారుల ఆరోగ్యానికి పోషకాహారమే పునాది

తిరుపతి విద్య, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:



చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తొలి దశ నుంచే పోషకాహారంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని బీజేపీ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నరేష్ బాబు సూచించారు. తిరుపతి అర్బన్ పరిధిలోని ఎస్.టి.వి. నగర్ అంబేద్కర్ పాఠశాలలో ఉన్న అంగన్వాడి కేంద్రంలో శనివారం అంగన్వాడి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా ఏడో నెలలోకి అడుగుపెట్టిన చిన్నారులకు అన్నప్రాస కార్యక్రమాన్ని నిర్వహించి, వారి పోషణపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. డాక్టర్ నరేష్ బాబు మాట్లాడుతూ పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు సమతుల్య ఆహారం కీలకమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి ఎం. మంజుల, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి ఎ. సవిత, టీసీడీఎస్ సూపర్‌వైజర్ డి. హేమవతి, అంగన్వాడి టీచర్లు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

## 25 ఏళ్ల సేవకు ఘన సత్కారం

తిరుపతి విద్య, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:




చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు 25 ఏళ్లుగా సేవలందిస్తున్న అంగన్వాడి టీచర్ ఈ. గోమతికి సత్య నారాయణపురం మదర్స్ ఘనంగా సన్మానం చేశారు. తిరుపతి అర్బన్ రాస్ ప్రాజెక్ట్ పరిధిలోని సత్యనారాయణపురం అంగన్వాడి కేంద్రంలో శనివారం సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా అంగన్వాడి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల పోషణ, ఆరోగ్యం, అంగన్వాడి సేవల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. వైద్యశాఖకు చెందిన శ్రీహరి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. సూపర్‌వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యం, పోషణ, ప్రాథమిక విద్య, సమగ్ర అభివృద్ధిలో అంగన్వాడి కేంద్రాలు కీలకంగా పనిచేస్తున్నాయని తెలిపారు. సత్యనారాయణపురం 1, 2, సాయినగర్, విజయపురం, రాఘవేంద్రనగర్, లెప్రసీ కాలనీ, ఎల్ఎన్‌సీ నగర్, గోవిందనగర్ అంగన్వాడి కేంద్రాల్లోనూ ఉత్సవాలను నిర్వహించారు.

## పంచమూర్తుల గ్రామోత్సవం

***శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:*** పౌర్ణమి సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరుడు దేవేరితో కలిసి గ్రామ ప్రజలకు దర్శనమిచ్చారు. ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం రాత్రి స్వామిఅమ్మవార్లస గ్రామోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. స్వామిని బంగారు నంది వాహనంపై, దేవేరి బంగారు శిల్పి వాహనంపై ప్రతిష్ఠించి గ్రామోత్సవానికి సిద్ధం చేశారు. పంచమూర్తులుగా వినాయకుడు, సుబ్రమణ్యంస్వామి, స్వామి అమ్మవార్లతో పాటు భక్తకన్నప్పను ఊరేగింపుగా జరిపారు. ఉత్సవాన్ని టెంపుల్ ఇన్స్‌పెక్టర్ వెంకటస్వామి పర్యవేక్షణలో నాలుగుమాడా వీధుల్లో ఊరేగించారు.

## శ్రీవారి వైద్య సేవల్లో...స్విమ్స్‌లో ప్రముఖ వైద్య నిపుణులు

తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: కార్డియోథొరాసిక్ సర్జరీ, కార్డియాలజీ, గైనకాలజీ విభాగాల్లో సెప్టెంబర్ 24 నుంచి 26 వరకు ప్రత్యేక వైద్య సేవలు అందించారు. దేశంలోని ప్రముఖ వైద్య నిపుణుల అనుభవంతో స్విమ్స్‌లో రోగులకు అత్యాధునిక వైద్య సేవలుస్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డాక్టర్ గుడారు జగదీష్‌తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు (టీటీడీ) సహకారంతో స్విమ్స్‌లో నిర్వహిస్తున్న శ్రీవారి వైద్య సేవ కార్యక్రమం ద్వారా ప్రముఖ వైద్య నిపుణుల సేవలను రోగులకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. గుడారు జగదీష్ తెలిపారు. టీటీడీ అందిస్తున్న నిరంతర సహకారంతో శ్రీవారి వైద్య సేవను మరింత విస్తృతంగా నిర్వహిస్తూ, వివిధ వైద్య విభాగాల్లో విశేష అనుభవం కలిగిన నిపుణులను స్విమ్స్‌కు ఆహ్వానించి రోగులకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. సెప్టెంబర్ 24 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించిన శ్రీవారి వైద్య సేవలో కార్డియోథొరాసిక్ సర్జరీ, కార్డియాలజీ, గైనకాలజీ విభాగాలకు చెందిన ప్రముఖ వైద్య నిపుణులు పాల్గొని వివిధ రకాల రోగులను పరీక్షించడంతో పాటు అవసరమైన శస్త్రచికిత్సలను కూడా నిర్వహించారు. 9,000కు పైగా గుండె శస్త్రచికిత్సల అనుభవంతో డా. కే. సుధాకర్ రావు, కార్డియోథొరాసిక్ సర్జరీ విభాగంలో బాదం బాలకృష్ణ, ట్రస్ట్ హాస్పిటల్, కాకినాడకు చెందిన డా. కే. సుధాకర్ రావు, శ్రీవారి వైద్య సేవలో పాల్గొన్నారు. ప్రస్తుతం మెడికవర్ హాస్పిటల్, కాకినాడలో కూడా విజిటింగ్ వైద్య నిపుణులుగా సేవలందిస్తున్నారు. డా. సుధాకర్ రావుకు కార్డియోథొరాసిక్ సర్జరీలో సుమారు 20 సంవత్సరాల అనుభవం ఉండగా, ఇప్పటివరకు 9,000కు పైగా కార్డియోథొరాసిక్ శస్త్రచికిత్సలు నిర్వహించారు. అంతే కాకుండా ఆయన గతంలో స్విమ్స్‌లో సుమారు 10 సంవత్సరాల పాటు ప్రొఫెసర్‌గా సేవలందించారు. తనకు ఎంతో అనుబంధం ఉన్న స్విమ్స్‌కు తిరిగి వచ్చి టీటీడీ సహకారంతో నిర్వహిస్తున్న శ్రీవారి వైద్య సేవలో రోగులకు సేవలందించడం ఎంతో ఆనందంగా ఉందని డా. సుధాకర్ రావు తెలిపారు. స్విమ్స్ పూర్వ విద్యార్థి డా. ఆకుల విద్యాసాగర్ సేవలుకార్డియాలజీ విభాగంలో డా. ఆకుల విద్యాసాగర్, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్, లక్ష్మీనారాయణ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, కరీంనగర్ నుంచి విచ్చేసి శ్రీవారి వైద్య సేవలో పాల్గొన్నారు. సుమారు 12 సంవత్సరాల అనుభవం కలిగిన డా. ఆకుల విద్యాసాగర్ స్విమ్స్‌లోనే పీజీ విద్యను పూర్తి చేయడం విశేషం. 25 ఏళ్ల అనుభవంతో డా. హెచ్.జి. పుష్పలగైనకాలజీ విభాగంలో బెంగళూరులోని లోహిత హాస్పిటల్‌కు చెందిన సీనియర్ కన్సల్టెంట్ డా. హెచ్.జి. పుష్పలత సేవలందించారు. టీటీడీ సహకారంతో నిర్వహిస్తున్న శ్రీవారి వైద్య సేవలో పాల్గొని స్విమ్స్ రోగులకు సేవలందించే అవకాశం లభించడం ఎంతో సంతోషంగా ఉందని డా. పుష్పలత తెలిపారు. ఈ అవకాశాన్ని కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ యాజమాన్యం, స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. గుడారు జగదీష్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. టీటీడీ సహకారం – రోగులకు నాణ్యమైన వైద్య సేవలకు బాటఈ సందర్భంగా డా. గుడారు జగదీష్ మాట్లాడుతూ టీటీడీ అందిస్తున్న సహకారం వల్ల శ్రీవారి వైద్య సేవను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవకాశం కలుగుతోందని తెలిపారు. టీటీడీ సహకారంతో కొనసాగుతున్న శ్రీవారి వైద్య సేవ స్విమ్స్‌లోని రోగులకు ఎంతో ప్రయోజనకరంగా మారిందని, భవిష్యత్తులో కూడా మరిన్ని విభాగాలకు చెందిన ప్రముఖ వైద్య నిపుణులను స్విమ్స్‌కు ఆహ్వానించి సేవలను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామని డా. గుడారు జగదీష్ తెలిపారు. శ్రీవారి వైద్య సేవకు నిరంతర సహకారం అందిస్తున్న టీటీడీ చైర్మన్, ఈఓ, అడిషనల్ ఈఓతో పాటు టీటీడీ యాజమాన్యానికి డా. గుడారు జగదీష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.




## మొక్కలు నాటిన శ్రీకాళహస్తి జనసేన



తొట్టంబేడు, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా సేవా కార్యక్రమాలే పరమావధిగా ముందుకు సాగుతున్న జనసేన పార్టీ మరోసారి తన ప్రత్యేకతను చాటింది. జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పవన్ కళ్యాణ్ నమ్మినబంటు రామ్ తాళ్లూరి జన్మదిన వేడుకలను తొట్టంబేడు మండలం గుండేలిగుంట పాఠశాలలో జనసైనికులు వినూత్న రీతిలో జరుపుకున్నారు. కేకులు కట్ చేయడం, ఫ్లెక్సీల హడావుడికి దూరంగా పర్యావరణాన్ని కాపాడేందుకు మొక్కలు నాటి తమ అధినేత బాటలోనే తాము నడుస్తున్నామని నిరూపించారు. పేట బ్రదర్స్ మిత్రబృందం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో జనసేన నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేట చిరంజీవి మాట్లాడుతూ రామ్ తాళ్లూరి పార్టీ కోసం చేస్తున్న కృషిని కొనియాడారు. అదేవిధంగా పేట చంద్రశేఖర్ మాట్లాడుతూ తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన తరఫున పోటీ చేస్తున్న ప్రతి కార్పొరేటర్ అభ్యర్థికి అండగా నిలిచి ధైర్యంగా ముందుకు నడిపిస్తున్నారని, అతి తక్కువ సమయంలోనే తెలంగాణలో లక్షలాది మంది జనసైనికులను ఒకే తాటిపైకి తెచ్చిన ఘనత రామ్ తాళ్లూరికే దక్కుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ మొక్కలు నాటే కార్యక్రమంలో జనసేన నాయకులు పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, షేక్ ఆరిఫ్, తేజ, గంధం శ్రీను, రమేష్ బాబు, కల్లిపూడి వెంకటేష్, దినేష్, దివాకర్, సాయి, శ్రీకాళహస్తిటౌన్‌బ్యాంక్‌డైరెక్టర్, వీర మహిళ కవిత తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## పిల్లల ఆరోగ్యమే లక్ష్యంగా అవగాహన

తొట్టంబేడు, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:



తొట్టంబేడు మండలం కొత్తకండ్రిగ అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలుఘనంగా జరిగాయి. పిల్లల ఆరోగ్య పరిరక్షణ, పౌష్టికాహార ప్రాముఖ్యతను తల్లిదండ్రులకు వివరించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడీ టీచర్ మణిశ్రీ, సూపర్వైజర్ మరియమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పాఠశాల హెడ్ మాస్టర్ బాలమురుగన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చిన్నారులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ మరియమ్మ మాట్లాడుతూ చిన్నారుల ఎదుగుదలలో పౌష్టికాహారం పాత్ర కీలకమని తెలిపారు. ప్రతి ఒక్కరూ పోషకాహారాన్ని అలవాటు చేసుకుంటూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.

## జిల్లా విజేతగా నిలిచి...రాష్ట్రస్థాయి పోటీకి రుక్మిణి

తిరుపతి విద్య, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :



పరుగులో వేగమే కాదు.. పట్టుదల కూడా విజయాన్ని అందిస్తుందని శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థిని పి. రుక్మిణి నిరూపించారు. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో దిశ తిరుపతి నిర్వహించిన 5కె రెడ్ రన్‌లో ఆమె ప్రథమ స్థానంలో నిలిచి రూ.10 వేల నగదు బహుమతి అందుకున్నారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ పోటీలో విజయం సాధించడంతో రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొనేందుకు రుక్మిణి అర్హత సాధించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. భీమన్న మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీకి అర్హత సాధించడం కళాశాలకు గర్వకారణమన్నారు. రాష్ట్రస్థాయి పోటీలోనూ రుక్మిణి ప్రతిభ కనబరచాలని సూచించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ బి. భారతి మాట్లాడుతూ విద్యార్థినుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు నిరంతర ప్రోత్సాహం అవసరమన్నారు. కార్యక్రమంలో కళాశాల సూపరింటెండెంట్ శాంతి, అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఇగ్నో ప్రవేశాలకు గడువు 30 వరకు

తిరుపతి విద్య, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:



ఉన్నత విద్యను కొనసాగించాల నుకునే వారికి ఇగ్నో ద్వారా అందిస్తున్న వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నట్లు ఎస్.వి. ఆర్ట్స్ కళాశాలలోని ఇగ్నో అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ వై. మల్లికార్జునరావు తెలిపారు. డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 30వ తేదీ వరకు గడువు ఉందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లికార్జునరావు మాట్లాడుతూ ఓపెన్ యూనివర్సిటీ విధానంలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులు, వివిధ కారణాలతో రెగ్యులర్ విద్యను కొనసాగించలేకపోయిన వారు ఇగ్నో కోర్సులను సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. తమకు ఆసక్తి ఉన్న కోర్సు, అర్హతలను పరిశీలించుకుని నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఇగ్నో అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

## ఎన్ఎంఎంఎస్ వివరాల్లో తప్పులకు తావొద్దు

తిరుపతి విద్య, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :



ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్- 2026-27కు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న విద్యార్థుల నామినల్ రోల్స్ ధ్రువీకరణ, సమర్పణ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి కేవీఎన్ కుమార్ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థుల దరఖాస్తులు, ధ్రువపత్రాలు, సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతను నిర్ధారించిన తర్వాతే నామినల్ రోల్స్‌ను ధ్రువీకరించాలని సూచించారు. డీఈఓ కేవీఎన్ కుమార్ మాట్లాడుతూ స్కాలర్‌షిప్‌కు సంబంధించిన విద్యార్థుల వివరాల్లో ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాలను ధ్రువపత్రాలతో సరిపోల్చి పరిశీలించాలని తెలిపారు. విద్యార్థుల అర్హత, వ్యక్తిగత వివరాలు, సంబంధిత రికార్డులను జాగ్రత్తగా తనిఖీ చేయాలని సూచించారు. ధ్రువీకరణ పూర్తయిన నామినల్ రోల్స్‌ను అక్టోబర్ 12లోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి సమర్పించాలని డీఈఓ తెలిపారు. గడువు కోసం వేచి ఉండకుండా ప్రక్రియనుసకాలంలోపూర్తి చేసి సమర్పించేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## ప్రకృతిని కాపాడుతూనే పేదలకు ఆదాయం

**-జీవవైవిధ్యాన్ని ఆర్థిక వనరుగా మలచాలి -విద్యార్థుల ప్రతిపాదనలకు ప్రోత్సాహం**




తిరుపతి విద్య, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: జీవవైవిధ్యాన్ని కాపాడట మే లక్ష్యంగా పెట్టుకోకుండా.. దానిని స్థానిక ప్రజలకు ఆదాయ వనరుగా మలిచినప్పుడే పరిరక్షణకు మరింత బలం చేకూరుతుందని నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ నాన్ అఫీషియల్ సభ్యుడు చిరుకూరి వెంకటేశ్వర్ ప్రసాద్ అన్నారు. ప్రకృతి సంపదను సంరక్షిస్తూనే పేద కుటుంబాలకు ఉపాధి, ఆదాయ అవకాశాలు కల్పించే ఆర్థిక నమూనాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న జీవవైవిధ్య వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. జీవవైవిధ్య పరిరక్షణ అంటే చెట్లను పెంచడం, జీవజాలాన్ని కాపాడటానికే పరిమితం కాదని వెంకటేశ్వర్ ప్రసాద్ తెలిపారు. ప్రకృతి వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ వాటి ప్రయోజనాలను స్థానిక ప్రజలకు అందించాల్సి ఉందన్నారు. శేషాచలం అడవుల్లో గతంలో విస్తారంగా ఉన్న పండ్ల చెట్లు, పొదలు తగ్గిపోవడంతో పక్షులు, సరీసృపాలు, ఇతర జీవులకు ఆహారం, ఆవాసం కొరత ఏర్పడుతోందని చెప్పారు. ఇది జీవవైవిధ్య సమతుల్యతపై ప్రభావం చూపుతోందన్నారు. శేషాచలం జీవవైవిధ్య పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని ఆయన వివరించారు. గతవారం వేదిక్ యూనివర్సిటీలో అవగాహన కార్యక్రమం నిర్వహించామని, ప్రస్తుతం ఎస్వీయూలో వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులను జీవవైవిధ్య అంబాసిడర్లుగా తీర్చిదిద్ది, ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసి గ్రామస్థాయి జీవవైవిధ్య నిర్వహణ కమిటీల్లో భాగస్వాములను చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. దేశంలోని అత్యంత పేద ప్రజలు నివసించే గ్రామాల్లో జీవవైవిధ్య పరిరక్షణతోనే ఆదాయ మార్గాలను అభివృద్ధి చేయడమే తమ ఉద్దేశమని వెంకటేశ్వర్ ప్రసాద్ పేర్కొన్నారు. ప్రకృతి వనరులను కాపాడుతూ స్థానికులకు ఆర్థిక ప్రయోజనం కలిగే విధానాలపై కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పరిశీలిస్తున్నామని తెలిపారు. విశ్వవిద్యాలయ విద్యార్థులు జీవవైవిధ్య పరిరక్షణ, పర్యావరణ అభివృద్ధి, గ్రామీణ ఆర్థికాభివృద్ధిపై వినూత్న ప్రతిపాదనలు అందించాలని కోరారు. మంచి ప్రతిపాదనలను నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ స్థాయిలో పరిశీలించి, ఆచరణలోకి తీసుకువచ్చే అవకాశాలను పరిశీలిస్తామని

## విష్ణు కెమికల్స్‌లో ప్రమాదం: ఒకరు మృతి

శ్రీకాళహస్తిరూరల్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలంలోని విష్ణుకెమికల్స్‌లో శనివారం జరిగిన ప్రమాదంలో ఓ కార్మికుడు ఆశువులు బాసాడు. రూరల్ సిఐ ఇబ్రహీం అందించిన కథనం మేరకు ఉత్తర ప్రదేశ్‌కు చెందిన సూరజ్ (19) ఫ్యాక్టరీలో వేస్టేజ్ కన్వర్ బెల్టు వద్ద పని చేస్తుండగా ప్రమాద వశాత్తు అందులో చేయి తుగులుకుంది. దాంతో ఆతని శరీరం అంతా ముక్కలు ముక్కలు అయ్యింది. సమాచారం అందటంతో పోలీసులు అక్కడ చేరుకొని కేసు నమోదు చేసి పోస్టుమార్టం జరిపి మృతదేహాన్ని స్వరాష్ట్రానికి పంపినట్లు తెలిపారు.

## రాజీవ్‌నగర్‌లో మేగా కార్డ్ సెర్చ్...90 వాహనాల సీజ్

తొట్టంబేడు, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తి పిచ్చాటూరు మార్గంలోని రాజీవ్‌నగర్ పరిసరాల్లో శనివారం వేకువ జామున నిర్వహించిన పోలీసు కార్డ్ అండ్ సర్చ్ 'త్రిశూల్ ఆపరేషన్' కార్యక్రమంలో 90 వాహనాలుసీజ్ చేసినట్లు డివైయస్‌పి నరసింహామూర్తి మీడియాకు తెలిపారు. జిల్లా ఎస్‌పి సుబ్బరాయుడు ఆదేశాలతో తిరుపతిజిల్లాలోని అధికారులు హాజరు కాగా ప్రత్యేక సెర్చ్‌ను నిర్వహించినట్లు వివరించారు. జిల్లా ఎస్‌పి ఆదేశాలతో అడ్మిన్ ఎస్‌పి ఏ.శ్రీనివాసులు పర్యవేక్షణలో నిర్వహించిన మెగా కార్యక్రమాల్లో 78 ద్విచక్ర వాహనాలు, 12ఆటోలు రికార్డుల్లేనివి అదుపులో తీసుకున్నట్లు ప్రకటించారు. సిబ్బంది రాజీవ్‌నగర్‌కాలనీలోని ప్రధాన రహదారులు, వీధులు, అనుమానాస్పద ప్రాంతాల్లో గాలింపు చేసినట్లు తెలిపారు. ఈ సెర్చ్ కార్యక్రమాల్లో సిఐలు వెంకటేశ్, ఇబ్రహీం, నాగరాజు, జయచంద్ర, ఆర్ఐలు నాగభూషణం, రమణారెడ్డిలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## పరశురామేశ్వరుని సేవలో రాస్ ప్రతినిధులు

ఏర్పేడు, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:



ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన ఆనందవల్లి సమేత పరశురామేశ్వరుని సన్నిధిలో శనివారం రాస్ ప్రతినిధి బృందంగా ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. ఈ నేపథ్యంలో రాస్ అధ్యక్షుడు వవెంకటరత్నం నాయుడు, కార్యదర్శి మమత డైరెక్టర్ నాగరాజు నాయుడు రాజశేఖర్‌నాయుడు, హరిలో రాగా వారికి ఆలయ మర్యాదలతో ఆలయ చైర్మెన్ గిరినాయుడు ఆలయ ఇఒ మునిశేఖర్ ఆలయ వేదపండితులు స్వాగతం పలికారు. దర్శనం తరువాత వారికి ఆలయ మర్యాదలతో వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందిచారు. రాస్ ప్రతినిధులను ఆలయం చేపడుతున్న అభివృద్ధి గురించి వివరిస్తూ రాస్ కూడా భాగస్వాములు కావాలని కోరారు.

## అక్కుర్తి పాఠశాలకు కొత్త కళ

శ్రీకాళహస్తి రూరల్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:




శ్రీకాళహస్తి మండలం అక్కుర్తి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. ఈ పాఠశాల దుస్థితిని గుర్తించిన శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పాఠశాల ప్రగతికి నిధులు అందించారు. కార్పొరేట్ పాఠశాలను తలదన్నేలా అన్ని సౌకర్యాలతో ముస్తాబైన పాఠశాలను శనివారం విద్యార్థులకు అంకితంచేశారు. గతంలో పాఠశాలను సందర్శించిన సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు అనుకున్న సమయం కంటే ముందే అభివృద్ధి పనులు పూర్తి చేశామని నిర్వాహకులు తెలిపారు. ఈ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం, విద్యార్థినీ విద్యార్థులకు వేర్వేరుగా మరుగుదొడ్ల సౌకర్యం, తరగతి గదుల్లో ఫ్లోరింగ్ టైల్స్, స్వచ్ఛమైన తాగునీటి సదుపాయం కల్పించారు. తన సంకల్పం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద పిల్లలకు మెరుగైన వసతులు కల్పించడమేనని, అందులో భాగంగానే అక్కుర్తి పాఠశాల అభివృద్ధికి కృషి చేశానని స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమంలో తనకు సహకరించిన రిచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ రమేష్నాథ్ లింగుట్లకి, సీఎస్ఆర్ నిధుల ద్వారా ఆర్థిక సహాయం అందించిన సోమనీ టైల్స్ యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఇలగనూరులో ప్రాణాంతకంగా...విద్యుత్ తీగలు

తొట్టంబేడు సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:



తొట్టంబేడు మండలం ఇలగనూరు హరిజనవాడలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారి గ్రామస్తుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయి. అంకమ్మ గుడి సమీపంలో వేలాడుతున్న విద్యుత్ లైన్లు ఒకదానికొకటి తాకుతూ నిప్పురవ్వలు చిమ్ముతుండడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విద్యుత్ లైన్లు చాలా కాలంగా కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని, గాలికి తీగలు ఒకదానికొకటి తాకిన ప్రతిసారీ భారీ శబ్దంతో నిప్పులు రేగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ దృశ్యం మరింత భయానకంగా ఉంటోందని తెలిపారు. ఏ క్షణంలోనైనా పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, దీంతో తప్పని పరిస్థితుల్లో గ్రామస్తులే కర్రలతో తీగలను ఒకదానికొకటి తాకకుండా అడ్డుపెట్టి తాత్కాలికంగా కాపాడుకుంటూ వస్తున్నారని వాపోయారు.

## మైనార్టీల హక్కులకు భరోసా.. రాయితీలపై అవగాహన

తిరుపతి విద్య, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :




మైనార్టీలకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, రుణ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు తమ హక్కులకు భంగం కలిగితే అధికారుల దృష్టికి తీసుకురావాలని జాతీయ మైనార్టీ కమిషన్ వైస్ చైర్‌పర్సన్ ఎస్. మునవరి బేగం సూచించారు. చిల్డ్రన్స్ ఎరీనాలో సిఎంజేఏసీ ఆధ్వర్యంలో జాతీయ మైనార్టీ కమిషన్ నిర్వహించిన అవగాహన, పరిష్కార కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముస్లింలు, క్రైస్తవులు, పార్సీలు, సిక్కులు, బౌద్ధులు తదితర మైనార్టీ వర్గాలకు రాజ్యాంగ పరంగా కల్పించిన హక్కులను పరిరక్షించేందుకు కమిషన్ అందుబాటులో ఉంటుందని మునవరి బేగం తెలిపారు. హక్కులకు భంగం కలిగించే ఘటనలు ఎదురైతే వాటిని కమిషన్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. బిషప్స్ డయాసిస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో క్రైస్తవులు, ముస్లింలకు శ్మశానవాటికలు, సమాధుల కోసం భూముల సమస్య ఉందన్నారు. కార్యక్రమంలో బిషప్ ఎంఎ పాల్, అనిల్ పాల్, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ సయ్యద్ బాషా, అబ్దుల్ మునీర్, గౌతమ్ జైన్, డేవిడ్ మనోహర్, పాస్టర్ ఇస్మాయిల్, జాన్ మస్కి తదితరులు, మైనార్టీ వర్గాల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## డిప్యూటీ మేయర్ పదవి ముస్లింలకు కేటాయించాలి



తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో అన్ని రాజకీయ పార్టీలు ముస్లిం మైనార్టీలకు సముచిత స్థానం కల్పించాలని ముస్లిం ఏసీ చైర్మన్ ముర్తుజ డిమాండ్ చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ మేము ఏ పార్టీకి అనుకూలము కాదు, ఏ పార్టీకి వ్యతిరేకం కాదఅన్నారు. మైనార్టీ ఇండ్ల చుట్టూ తిరిగి ఓట్లు వేసుకొని మమ్మల్ని విస్మరిస్తున్నారని అన్నారు. మా జనాభా ప్రాతిపదికన ముస్లింలకు టికెట్లు కేటాయించాలని, మైనార్టీ ఓట్లు ఎక్కువగా ఉన్న డివిజన్లలో వార్డులలో ముస్లిం అభ్యర్థులను మాత్రమే నిలబెట్టాలని, డిప్యూటీ మేయర్ పదవి ముస్లిం మైనార్టీలకు కేటాయించాలన్నారు. లౌకికవాదం అంటే ఓట్లు తీసుకోవడం కాదు మాకు అధికారంలో భాగస్వామ్యం ఇవ్వడం అని తెలిపారు. ముస్లిం మైనార్టీలకు న్యాయం జరగకపోతే రానున్న రోజుల్లో అన్ని మసీదు కమిటీలు, సంఘాలతో సమావేశమై భవిష్యత్తు కార్యాచరణ పై చర్చించి, ఓటును బహిష్కరించి, స్వతంత్ర అభ్యర్థులను నిలబెట్టతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎండి కల్లిముల్లా, పి పయిజుల్లా, ఎస్ సాదిక్, ఎస్ మునవర్, మెకానిక్ బాబు, ఎస్ అమీర్ భాష తదితరులు పాల్గొన్నారు.